
తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సంపుటి: 2 | సంచిక: 220 | మంగళవారం 31–12–2024 | పేజీలు: 08 | వెల: 5 | www.telanganamuchatlu.in

# మన్మోహనుడికి భారతరత్న ఇవ్వాలి

- కేంద్ర ప్రభుత్వాన్నీ కోరుతూ శాసన సభలో ఏకగ్రీవ తీర్మానం
- తెలంగాణ ఏర్పాటులో మన్మోహన్ సింగ్ ది కీలక పాత్ర
- మన్మోహన్ సింగ్ విగ్రహ ఏర్పాటుకు శాసన సభ ఆమోదం
- సంతాపం తెలుపుతూ శాసన సభ ఒక్కరోజు ప్రత్యేక సమావేశం



**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**
భారతదేశాన్ని ప్రపంచంలో మేటిగా నిలబెట్టేందుకు కృషి చేసిన దార్శనికుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ కి అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ప్రధానం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ, సభా నాయకుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అలాగే, తెలంగాణ ప్రజల 60 ఏండ్ల ఆకాంక్షలను నెరవేర్చిన గొప్ప నాయకుడిగా, భావి తరాలు స్మరించుకునేలా డాక్టర్ మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను సభ ఆమోదించింది. మాజీ ప్రధానమంత్రి, ఆర్థిక వేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలియజేస్తూ శాసనసభ ప్రత్యేకంగా సమావేశమైంది. దేశ పురోగతికి డాక్టర్ మన్మోహన్ సింగ్ అందించిన సేవలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పురుడుపోసి ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయే గొప్ప నాయకుడిగా వారి కృషిని స్మరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు. శాసనసభలో ముఖ్యమంత్రి ప్రవేశపెట్టి తీర్మానం…"భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఈ శాసనసభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తోంది. శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తుంది. అంతర్జాతీయ ప్రఖ్యాతి పొందిన ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశానికి విశిష్టమైన సేవలను అందించారు. కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారుగా, భారత రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌గా, ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్‌పర్సన్‌గా,

మిగతా 2లో



## మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్లతో సిఎం రేవంత్ రెడ్డి భేటీ

- రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టండి
- సత్యనాదెళ్లను కోరిన సిఎం రేవంత్ రెడ్డి
- మంత్రులతో కలిసి సత్యనాదెళ్ల నివాసానికి వెళ్లిన సిఎం

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్లతో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సిఎంతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉన్నారు.ఈ సందర్భంగా సత్య నాదెళ్ల మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉండేందుకు మైక్రోసాఫ్ట్ సిద్ధంగా ఉందని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ అవసరాలకు తగినట్లు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడంలో ముఖ్యమంత్రి దార్శనికతను ఆయన ప్రశంసించారు. నైపుణ్యాభివృద్ధి, మెరుగైన మౌలిక వసతుల కల్పన ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని, హైదరాబాద్‌ను ప్రపంచంలోని అగ్ర నగరాల్లో నిలబెడతాయని అభిప్రాయపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైదరాబాద్‌ను టెక్నాలజీ రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏఐ, జనరేటివ్ ఏఐ, క్లౌడ్ ఆధారిత వ్యవస్థల అభివృద్ధిపై దృష్టి సారించిందని

## అమృత్,సివిల్ సప్లై స్కాంలో కేంద్రం ఎందుకు విచారణ జరుపట్లేదు ?

- మంత్రి పొంగులేటి ఇంట్లో ఈడీ రైడ్స్ జరిగితే కేంద్రమే కాపాడుతుందని ఆరోపణ
- బీఆర్ఎస్ కేడర్‌లో విశ్వాసం, ఆత్మస్థయిర్యం కనిపిస్తోంది
- ప్రభుత్వం పెట్టి కేసులకు భయపడేది లేదు
- ఈ–కార్ రేసింగ్ వ్యవహారంలో తాను ఎక్కడ మాట మార్చలేదు
- చెప్పినదానికే కట్టుబడి ఉన్నాను
- ఈ–కార్ రేసు విషయంలో మంత్రి హోదాలోనే తానే డబ్బులు చెల్లించమన్నానని స్పష్టం
- మాజీ మంత్రి,బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**
అమృత్, సివిల్ సప్లై స్కాంలో కేంద్ర ప్రభుత్వం ఎందుకు విచారణ జరపదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంట్లో ఈడీ రైడ్స్ జరిగితే.. కేంద్రమే కాపాడుతుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ కుంభకోణాలకు కేంద్రప్రభుత్వం సహకరిస్తుందని విమర్శలు చేశారు. 2025లో బీఆర్ఎస్ అధ్యక్షుడి ఎన్నిక, సంస్థాగతంగా కమిటీలు వేస్తామని కేటీఆర్ తెలిపారు.ఫార్ములా ఈ కార్ రేసు కేసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు మరోసారి స్పందించారు. తనకు ఈడీ నోటీసులు వచ్చిన మాట వాస్తవమని అన్నారు. తనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పసలేని కేసులు పెట్టరాని మండిపడ్డారు. ఏసీబీ కేసులో బలం లేదని సీఎం రేవంత్ రెడ్డికి కూడా తెలుసు అని చెప్పారు. ఏసీబీ ఎఫ్ఐఆర్

మిగతా 2లో




## మంగళవారం రాత్రి ఫ్లైఓవర్లు బంద్

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**
న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో హైదరాబాద్‌లో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో నగరంలోని అన్ని ఫ్లై ఓవర్లను బంద్ చేయాలని పోలీసులు నిర్ణయించారు.
డిసెంబర్ 31న రాత్రి 10 గంటల తర్వాత బైకులు, వాణిజ్య వాహనాలకు ఫ్లై ఓవర్లకు అనుమతి ఉండదని పోలీసులు తెలిపారు. గత ఏడాది అనుభవాల దృష్ట్యా అతివేగంతో దూసుకెళ్లే ప్రమాదం పొంచి ఉందని ఈ నిర్ణయం తీసుకున్నారు.

**పోలీసుల ప్రత్యేక దృష్టి**
న్యూ ఇయర్ వేడుకలపై తెలంగాణ పోలీస్ శాఖ ప్రత్యేకంగా నిఘా వేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం డ్రగ్స్ రహిత తెలంగాణ, డ్రగ్స్ రహిత హైదరాబాద్ లక్ష్యాలను

మిగతా 2లో



## మద్యం ప్రియులకు శుభవార్త..!

- వైన్స్ షాపులు, బార్ల సమయాల పొడిగింపు

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:**
నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం షాపులు, బార్ల సమయాలను పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 31న వైన్స్ షాపులు అర్ధరాత్రి వరకు, బార్లు, రెస్టారెంట్లు తెల్లవారు జామున 1 గంట వరకు తెరిచి ఉండేందుకు అనుమతించింది.ఎక్సైజ్ శాఖ ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా ప్రజలు షాపులు, బార్లను ఎక్కువగా సందర్శించే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

## కాంగ్రెస్‌లో ఏమైనా జరగొచ్చు..!

- కమీషన్ల విషయంలో మంత్రుల మధ్య సఖ్యత లేదని ఆరోపణ
- వాళ్లలో వాళ్లు ఏమైనా చేసుకోవచ్చు
- 14 శాతం కమిషన్ మీదే ప్రభుత్వం బతుకుతోందని సంచలన ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
- అల్లు అర్జున్ ఘటనపై స్పందించిన పవన్ కళ్యాణ్ పై హాట్ కామెంట్స్



**కరీంనగర్,తెలంగాణ ముచ్చట్లు:**
ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్ట్‌పై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై పరోక్షంగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు గొప్పో పవన్ కల్యాణ్‌కే తెలియాలని అన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు చేసినట్లుగా పవన్ కల్యాణ్ భావిస్తున్నారా అని ప్రశ్నించారు. పుష్ 2 మూవీ కలెక్షన్లలో రేవంత్‌కు 14 శాతం వాటా ముట్టిందేమోననే అనుమానం తనకు ఉందని సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం

మిగతా 2లో

## రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది

మిగతా 2లో



## దటీజ్.. రేవంత్ రెడ్డి



- సిఎం రేవంత్ రెడ్డిపై ప్రశంసల జల్లు కురిపించిన పవన్ కళ్యాణ్
- అల్లు అర్జున్ అరెస్ట్ పై స్పందించిన ఎపి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- గోటితో పోయేదాన్ని గొడ్డలి వరకు తెచ్చుకున్నారని ఘాటు వ్యాఖ్య
- చట్టం అందరికీ సమానమని వ్యాఖ్య
- మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు

**అమరావతి,తెలంగాణ ముచ్చట్లు:**
పుష్ప 2 ప్రీమియర్ సందర్భంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్టుపై ఏపీ డిప్యటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. అల్లు అర్జున్ అంశంను గోటితో పోయేదాన్ని గొడ్డలి వరకూ తెచ్చారన్నారు. సారీ చెప్పడానికి పలు విధానాలు ఉంటాయని, ఘటన జరిగిన రెండో రోజే వెళ్లి మాట్లాడి ఉంటే ఇంత జరిగేది కాదన్నారు. తెలంగాణ ప్రభుత్వం సినీ పరిశ్రమతో గౌరవం, మర్యాదతో వ్యవహరించిందని.. సినిమా విషయంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చాలా ప్రోత్సాహం ఇచ్చారని పవన్ ప్రశంసించారు.
ఏపీ డిప్యటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళగిరిలో మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన, అల్లు అర్జున్ అరెస్టు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గురించి మాట్లాడారు. 'తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గొప్ప నాయకుడు. కింది స్థాయి నుంచి ఎదిగారు. సీఎం రేవంత్ బెనిఫిట్ షోలకు అవకాశం ఇచ్చారు. టికెట్ ధర పెంపునకూ వెసులుబాటు కల్పించారు. సీఎం సహకారంతోనే సినిమాల కలెక్షన్లు పెరిగాయి. పుష్ప 2 సినిమాకు సీఎం రేవంత్ పూర్తిగా సహకరించారు. టికెట్ రేట్ల పెంపునకు అవకాశం ఇవ్వడం చిత్ర పరిశ్రమను ప్రోత్సహించడమే. తెలంగాణ ప్రభుత్వం సినీ పరిశ్రమతో గౌరవం, మర్యాదతో వ్యవహరించింది. అల్లు అర్జున్ విషయంలో ముందు, వెనుక ఏం జరిగిందో నాకు పూర్తిగా తెలియదు. అయితే ఒకటి మాత్రం చెప్పగలను..

మిగతా 2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్లతో సిఎం రేవంత్ రెడ్డి భేటీ

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. ఈ ప్రయత్నాలకు మైక్రోసాఫ్ట్ మద్దతు అవసరమని కోరారు. హైదరాబాద్‌లోని తొలి సాంకేతిక సంస్థల్లో మైక్రోసాఫ్ట్ ఒకటని, ప్రస్తుతం 10,000 మందికి ఉపాధి కల్పిస్తోందని గుర్తుచేశారు. రాష్ట్రంలో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్‌లోనూ మైక్రోసాఫ్ట్ పెట్టుబడి పెట్టిందని, హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ పెట్టుబడులను విస్తరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ఫ్యూచర్ సిటీ, కొత్త తయారీ క్లస్టర్ల అభివృద్ధి, రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు అమలు చేస్తున్న ప్రణాళికలు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వంటి సంస్థల ద్వారా పరిశ్రమలకు అవసరమైన ప్రతిభావంతులను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి సత్య నాదెళ్లకు వివరించారు. ఈ సమావేశంలో సత్య నాదెళ్లతో పాటు మైక్రోసాఫ్ట్ ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ,ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ , ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# అమృత్,సివిల్ సప్లై స్కాంలో కేంద్రం ఎందుకు విచారణ జరుపట్లేదు ?

మొదటి పేజీ తరువాయి



తప్పని తెలంగాణ హైకోర్టులో క్వాష్ వేశానని... తాను ఆశావాదిని అని తెలిపారు. హై కోర్టులో ఏం జరుగుతుందో.. రేపు తెలుస్తుందన్నారు. కేసులను లీగల్ గానే ఎదుర్కొంటానని. కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. తాను మాట మార్చలేదని. ఈ కేసులో మెదటిరోజు చెప్పిన దానికి కట్టుబడి ఉన్నానని తేల్చిచెప్పారు. ఫార్ములా ఈ రేసుకు మంత్రి హోదాలోనే తానే డబ్బులు కట్టామన్నానని తేల్చిచెప్పారు. ప్రొసీజర్ ప్రకారం జరగకుంటే.. ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్, ఆర్బీఐ దగ్గరకు ఎందుకు పోలేదని ప్రశ్నించారు. కట్టిన ప్రతి పైసకు లెక్క ఉందని స్పష్టం చేశారు. డబ్బులు ముట్టినవారిపై కేసులు ఎందుకు పెట్టలేదని నిలదీశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఈ ఏడాది చివరకు బీఆర్ఎస్ క్యాడర్‌లో విశ్వాసం, ఆత్మస్థైర్యం కన్పిస్తోందని చెప్పారు. 2024లో ప్రతికూలతలను తట్టుకుని నిలబడ్డామన్నారు. 2024 కాంగ్రెస్ ప్రభుత్వ ధోకా నామ సంవత్సరమని ఆరోపించారు. 2004లో బీఆర్ఎస్ పార్టీకి కొంత గడ్డు కాలం నడిచిందని అన్నారు. హామీల అమల్లో రేవంత్ ప్రభుత్వం ఫెయిల్ అయిందని.. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల్లో నిరాశ కన్పిస్తుందని చెప్పారు. హామీలపై పెట్టుకున్న డెడ్‌లైన్లు కాంగ్రెస్‌కు శాపంగా మారాయని విమర్శించారు. కొత్త ఏడాదిలో రైతులను మోసం చేయటానికి రేవంత్ రెడ్డి ప్లాన్ చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఏడాది చివరకు బీఆర్ఎస్ క్యాడర్‌లో విశ్వాసం, ఆత్మస్థైర్యం కన్పిస్తోందని అన్నారు. 2024లో ప్రతికూలతలను తట్టుకుని నిలబడ్డామన్నారు. ఎప్పుడు బయటకు రావాలో మాజీ సీఎం కేసీఆర్‌కు తెలుసు అని చెప్పారు. 24ఏళ్లు కేసీఆర్ కష్టపడ్డారని... కాస్త రెస్ట్ తీసుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావుపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని ధ్వజమెత్తారు. ఢిల్లీలో పీవీకి మెమోరియల్ కట్టాలని అసెంబ్లీలో తీర్మానం ఎందుకు చేయరని ప్రశ్నించారు. మరణంలో కూడా పీవీని కాంగ్రెస్ గౌరవించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీవీ నరసింహారావుకు గౌరవం దక్కేవరకు రాజ్యసభలో బీఆర్ఎస్ కొట్లాడుతుందని అన్నారు. రేవంత్‌కు బీజేపీ ఎంపీలు రక్షణ కవచంగా మారారని ఆరోపించారు.

అమృత్, సివిల్ సప్లై స్కాంలో కేంద్రం ఎందుకు విచారణ జరపదని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంట్లో ఈడీ రైడ్స్ జరిగితే.. కేంద్రమే కాపాడుతుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ కుంభకోణాలకు కేంద్రప్రభుత్వం సహకరిస్తుందని విమర్శలు చేశారు. 2025లో బీఆర్ఎస్ అధ్యక్షుడి ఎన్నిక, సంస్థాగతంగా కమిటీలు వేస్తామని అన్నారు. కోర్టులో కేసులు వేయించి లోకల్ బాడీస్‌లో బీసీల రిజర్వేషన్లు కోత విధించాలని రేవంత్ ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. లోకల్ బాడీస్‌లో బీఆర్ఎస్ సత్తా చూపిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. లోకల్ బాడీస్‌లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేవరకు వదిలేది లేదని కేటీఆర్ హెచ్చరించారు



# రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది


- బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణ రాష్ట్రంలో క్రైం రేట్ పెరిగింది.. శిక్షలు తగ్గాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. క్రైం రేటు పది శాతం పెరిగిందన్నారు. పోలీసులు కాంగ్రెస్ నాయకుల చుట్టూ తిరగడం తప్ప ఏమీ చేయడం లేదని ధ్వజమెత్తారు. జిల్లాలో ఇంత పెద్ద నాయకులు ఉండి ఏం లాభమని.. బీజేపీ ఎమ్మెల్యేలను పని చేయనీయడం లేదని ఫైర్ అయ్యారు. సోమవారం నిజామాబాద్‌లో కవిత పర్యటించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... మాజీ సీఎం కేసీఆర్ ప్రజలను కళ్లల్లో పెట్టుకుని చూసుకున్నారని చెప్పారు. ప్రజలను మభ్య పెట్టి కల్లబొల్లి మాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎప్పుడు వస్తారో తెలియదని మండిపడ్డారు. ఆరు నెలల నుంచి పోలీస్ కమిషనర్ ఇక్కడ లేరని చెప్పారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క రైతు కూలీలకు రైతు భరోసా ఇస్తామన్నారని.. ఇంతవరకు ఎవరికీ రాలేదని కవిత అన్నారు. మహిళలకు రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇసుక అక్రమ వ్యాపారం.. గుట్కా దందా యథేచ్ఛగా సాగుతోందన్నారు. తెలంగాణ యూనివర్సిటీకి వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని చెప్పిన వారు కమిటీల పేరిట కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా నిజామాబాద్‌ను అభివృద్ధి చేస్తారని అనుకుంటే ఇక్కడ హైడ్రా లాగా నిడ్రా తెస్తా అంటున్నారని ధ్వజమెత్తారు. ప్రజలను భయాందోళనకు గురి చేయకుండా అభివృద్ధి పనులకు నిధులు తేవాలని కోరారు. రాబోయే రోజులు బీఆర్ఎస్ పార్టీవేనని చెప్పారు. కాంగ్రెస్‌ను నిలదీస్తే బీజేపీకి అంత ఉలుకు ఎందుకని ప్రశ్నించారు. కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

# మన్మోహనుడికి భారతరత్న ఇవ్వాలి

మొదటి పేజీ తరువాయి



కేంద్ర ఆర్థిక మంత్రిగా, భారత ప్రధానమంత్రిగా వివిధ హోదాలలో వారు ఈ దేశానికి ఎన్నో సేవలను అందించారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశంలో ఆర్థిక సంస్కరణల రూపశిల్పి. 1991 మరియు 1996 మధ్య కేంద్ర ఆర్థిక మంత్రిగా దేశ ఆర్థిక వ్యవస్థను సరళీకరించి ఆర్థిక స్థితిగతుల దశ దిశను మార్చే నిర్మాణాత్మక సంస్కరణలు అమలు చేయడంలో కీలక పాత్ర పోషించారు. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలతో అంతర్జాతీయ స్థాయిలో భారత ఆర్థిక వ్యవస్థను సుస్థిరంగా నిలబడేలా చేయగలిగారు. 2004 మరియు 2014 మధ్య భారత ప్రధానమంత్రిగా ఉన్న మన్మోహన్ సింగ్ తన పదవీకాలంలో ఎన్నో చారిత్రాత్మకమైన సామాజిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ఆర్థిక మంత్రిగా వారు వేసిన పునాదులు ఈరోజు భారతదేశం ప్రపంచ దేశాలతో మనం పోటీ పడుతున్నాం. ప్రపంచమే గర్వించదగ్గ ఆర్థికవేత్త. వారిని కోల్పోవడం దేశానికి తీరని లోటు.

ప్రజలకు ఉపాధి కల్పించే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, పరిపాలనలో పారదర్శకతను చాటి చెప్పే సమాచార హక్కు చట్టం, ప్రజారోగ్యానికి ప్రాధాన్యతను ఇచ్చిన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ప్రారంభించారు. ప్రతి పౌరుడికి ఆధార్ కార్డు లాంటి సామాజిక విప్లవాత్మక కార్యక్రమాలను వారి హయాంలోనే మొదలయ్యాయి.

ఉపాధి హామీ పథకంతో ఏడాదికి కనీసం వంద రోజుల పని కల్పించడం ద్వారా పేదలకు ఆహార భద్రత కల్పించవచ్చన్న గొప్ప లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో అనంతపూర్‌లో, తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో ఆ కార్యక్రమాన్ని దేశానికి అంకితం చేయడం జరిగింది.

భూ సేకరణ సందర్భాల్లో నిరాశ్రయులవుతున్న వారికి అండగా నిలవాలని, వారికి నష్టం జరక్కుండా ఉండాలని ఆనాడు డాక్టర్ మన్మోహన్ సింగ్ 2013 భూసేకరణ చట్టంలో గణనీయమైన మార్పులు తీసుకొచ్చారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న ఆదివాసీలు, గిరిజనులను ఆదుకోవడానికి 2006 లో అటవీ హక్కుల చట్టాన్ని సవరించడంతతో ఆదివాసీల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. 4 కోట్ల తెలంగాణ రాష్ట్ర ప్రజలు డాక్టర్ మన్మోహన్ సింగ్ కి ఎంతో రుణపడి ఉన్నారు. వారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమమైంది. 2014 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించింది. ఎన్నో ఏండ్ల పోరాటం ఫలించి తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. మన్మోహన్ సింగ్ దేశానికి ముఖ్యంగా తెలంగాణకు చేసిన సేవలకు ఈ సభ అపారమైన కృతజ్ఞతలను తెలియజేస్తుంది.

మన్మోహన్ సింగ్ తెలంగాణకు ఆత్మబంధువు. 60 ఏళ్ల తెలంగాణ కలను సాకారం చేసిన నాయకుడు. తెలంగాణ ప్రజలకు సోనియాగాంధీ ఇచ్చిన మాటను పార్లమెంటరీ ప్రక్రియలో నెరవేర్చే బాధ్యతతో ప్రధానమంత్రి హోదాలో తెలంగాణకు రాష్ట్ర హోదా కల్పించిన గొప్ప మానవతావాది. తెలంగాణతో ఆయన అనుబంధం విడదీయలేనిది. రాష్ట్రం ఉన్నంత వరకు మర్చిపోలేనిది.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో... రాజ్యసభలో ఒక దశలో రాజ్యాంగ సవరణల కోసం వచ్చిన చర్చలు తెలంగాణ రాష్ట్రం వెనక్కి పోతుందేమో అన్నంత గందరగోళ పరిస్థితులు ఏర్పడిన సందర్భంలో మన్మోహన్ సింగ్ కి అత్యంత సన్నిహితుడిగా అత్యంత నమ్మకమైన సహచరుడుగా జైపాల్ రెడ్డి తో మాట్లాడి వ్యూహాత్మక చతురతతో సమన్వయ పరిచి ఆ సవరణలకు ప్రధానమంత్రి వెళ్లి రాజ్యసభలో ప్రకటన ఇప్పించిన సందర్భం మనం ఎప్పటికీ మర్చిపోలేని సందర్భం. ఈ రాష్ట్రానికి పురుడు పోసిన డాక్టర్‌గా మన్మోహన్ సింగ్ ని తెలంగాణ సమాజం ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటుంది. అటువంటి మహనీయుడికి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరఫున ఈ శాసనసభ ద్వారా రాజకీయాలు పార్టీలకు అతీతంగా కృతజ్ఞతలు తెలపడమే కాక ఘన నివాళి అర్పించాల్సిన అవసరం ఉంది.

**తెలంగాణ ఏర్పాటుకు విడదీయలేని అనుబంధం ఉన్న డాక్టర్ మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ చేసుకోవడం ద్వారా శాశ్వతంగా మనం వారి వర్ధంతులు, జయంతులు, వారి జ్ఞాపకాలు శాశ్వతంగా తెలంగాణ ప్రజల గుండెల్లో పదిలమై ఉండే విధంగా ఒక మంచి ప్రాంతంలో వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సముచితమైన నిర్ణయం". ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ఈ తీర్మానంపై సమగ్ర చర్చ అనంతరం శాసనసభ దాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.**

దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిన సందర్భంగా తెలంగాణ శాసనసభ ఒకరోజు ప్రత్యేకంగా సమావేశాలను ఏర్పాటు చేసి రాజకీయాలకు అతీతంగా వారికి భారతరత్న ఇవ్వాలని ఈ సభలో సభ్యులందరి ఆమోదం కోరుతూ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టాం.

భారతదేశాన్ని ప్రపంచ స్థాయిలో మేటి దేశంగా నిలబెట్టేందుకు వారు చూపిన దార్శనికత ఆయన చేసిన కృషిని అందరూ గుర్తుంచుకోవాలి, భావితరాలు స్మరించుకోవాలి. డాక్టర్ మన్మోహన్ సింగ్ కి అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రధానం ప్రధానం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ సభ తీర్మానం చేస్తుంది.

# కాంగ్రెస్‌లో ఏమైనా జరగొచ్చు..!

మొదటి పేజీ తరువాయి



కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... తెలంగాణ అసెంబ్లీ ఎందుకు పెట్టారంటే.. అల్లు అర్జున్ కోసం అన్నట్లుగా ఉందని విమర్శించారు. అల్లు అర్జున్‌కు రేవంత్‌కు ఎక్కడో చేడిందని ఆరోపించారు. ఒక వ్యక్తి గురించి ఇంతగా అసెంబ్లీలో మాట్లాడాల్సిన అవసరం ఏంటని బండి సంజయ్ నిలదీశారు. కాంగ్రెస్‌లో అంత్యర్యుద్ధం జరుగుతోందని బండి సంజయ్ విమర్శించారు.

కమీషన్ల విషయంలో మంత్రుల మధ్య సఖ్యత లేదని అన్నారు. కాంగ్రెస్‌లో ఏమైనా జరగొచ్చు.. వాళ్లలో వాళ్లు ఏమైనా చేసుకోవచ్చని షాకింగ్ కామెంట్స్ చేశారు. 14 శాతం కమీషన్ మీదే ప్రభుత్వం బతుకుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ముగ్గురు మంత్రుల బండారం బయట పెడతానని హెచ్చరించారు. బ్రోకర్లను పెట్టుకుని బిల్లులు మంజూరు చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మంత్రులందరికీ సీఎం కావాలని ఉందని అన్నారు. ఢిల్లీకి డబ్బులు పంపడం వల్లే.. సీఎం పదవి నిలబడుతోందని ఆరోపించారు. డబ్బులు ఇవ్వకుంటే మంత్రుల కుర్చీలు కూడా ఉండవని బండి సంజయ్ తీవ్ర విమర్శలు గుప్పించారు.





# దటీజ్.. రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

చట్టం అందరికీ సమానం. ఇలాంటి ఘటనల్లో పోలీసులను తప్పుపట్టలేం. వారు ఎప్పుడోఓ భద్రత గురించే ఆలోచిస్తారు' అని డిపూటీ సీఎం అన్నారు.'ఈ ఘటనలో రేవతి చనిపోవడం నన్ను కలచి వేసింది. గోటితో పోయే దాన్ని.. గొడ్డలి వరకూ తెచ్చారు. మేము అండగా ఉన్నామని బాధిత కుటుంబానికి ముందే చెప్పి ఉండాల్సింది. బాధిత కుటుంబాన్ని వెంటనే పరామర్శించాల్సింది. సారీ చెప్పడానికి పలు విధానాలు ఉంటాయి. రెండో రోజే వెళ్లి మాట్లాడి ఉంటే ఇంత జరిగేది కాదు. ప్రతి హీరో తన సినిమాపై ప్రేక్షకులు ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలనుకుంటారు. అభిమానులకు అభివాదం చేయాలనే ఆలోచన ప్రతి హీరోకు ఉంటుంది. ఈ సమస్యలో హీరోను ఒంటరి చేశారు. అల్లు అర్జున్ ఒక్కడినే దోషిగా మార్చడం కూడా కరెక్ట్ కాదు' అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# మంగళవారం రాత్రి ఫ్లైఓవర్లు బంద్

మొదటి పేజీ తరువాయి



నిర్ధేశించిన నేపథ్యంలో పోలీస్ శాఖలోని అన్ని విభాగాలు న్యూ ఇయర్ వేడుకలపై ఫోకస్ చేశాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంతో పాటు నగర శివారుల్లో జరిగే పార్టీలపై ప్రత్యేకంగా నిఘా పెట్టనున్నట్టు తెలుస్తోంది. అలాగే పలు జిల్లాల్లోని ముఖ్య నగరాల్లో, ఫామ్ హౌస్‌లు, బార్లు, రెస్టారెంట్లు, పబ్‌లు, హోటళ్లపై పోలీస్ శాఖ ఓ కన్నేసి ఉంచింది. న్యూ ఇయర్ వేడుకలపై సివిల్ పోలీస్‌తో పాటు నార్కోటిక్, ఎక్సైజ్, ఎస్‌ఓటి పోలీస్ విభాగాలు కూడా అలర్ట్ అయ్యాయి. వేడుకల్లో భాగంగా ఆకస్మిక తనిఖీలకు ప్లాన్ చేసుకున్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే ఇప్పటికే హైదరాబాద్, మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బార్ అండ్ రెస్టారెంట్స్, పబ్స్ , హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు ప్రారంభించారు. బార్లు, పబ్‌ల లైసెన్స్ తనిఖీ చేశారు.

**మైనర్లను అనుమతిస్తే కేసులే**

కొత్త ఏడాది వేడుకల్లో మైనర్లను బార్లు, పబ్‌లకు అనుమతిస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. డీజేలతో హంగామా చేయవద్దని, నిషేధానికి సహకరించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా సౌండ్ పొలుష్యన్‌కు కారణంగా కాకుండా చూసుకోవాలని పబ్ యజమానులకు ఆదేశాలిచ్చారు.

# మంత్రి సీతక్క చొరవ.. కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల దస్త్రంపై సీఎం సంతకం

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:



తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న మూడు వేల మంది కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం రెన్యువల్ అందించింది. ఈ రెన్యువల్ పత్రాలు కొన్ని నెలలుగా పెండింగ్లో ఉన్న సమయంలో, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకొని,సీఆర్టి రెన్యువల్ ఫైల్‌ను అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.ఈ చర్చల అనంతరం, గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రెన్యువల్ పత్రంపై సంతకం చేశారు. ఈ నిర్ణయానికి గిరిజన సంక్షేమశాఖ మంత్రి సీతక్క సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు హైకోర్టులో ఊరట

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:



తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు హైకోర్టులో ఊరట లభించింది. అనుమతి లేకుండా నిరాహార దీక్ష చేశారని, 2019లో ఆయనపై ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసు నమోదైంది. అయితే, ఆ కేసును కొట్టివేయాలంటూ హైకోర్టులో గడ్డం ప్రసాద్ కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ కేసును కొట్టివేశారు.

# స్వార్థ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల మాటలు నమ్మొద్దు: సజ్జనార్


హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:



బెట్టింగ్ యాప్‌లు ఎంతో మంది ప్రాణాలను బలి తీసుకుంటున్నాయని టీజీఆర్టీసీ ఎండీ, ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ అన్నారు. కాసులకు కక్కుర్తిపడి వాటికి ప్రచారం చేయొద్దని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఆయన సూచించారు. ఈమేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. ''రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావొచ్చని.. ఇన్‌ఫ్లుయెన్సర్లు సోషల్ మీడియాలో విడుదల చేసే వీడియోల వల్ల అమాయకులు ఆన్‌లైన్ బెట్టింగ్ మహమ్మారికి బానిసలవుతున్నారు. బంగారు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. స్వలాభం కోసం ప్రజాశ్రేయస్సును విస్మరించడం ఎంత వరకు సమంజసం? సమాజక్షేమం పట్టని మీ పెడధోరణులు క్షమించరానివి. కష్టపడకుండానే కాసులు పోగేసుకోవాలన్న ఆలోచన అనర్థమని యువత గుర్తించాలి. స్వార్థ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల మాటలు నమ్మి ఆన్‌లైన్ బెట్టింగ్ మాయలో పడకండి. ఇలాంటి సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండండి'' అని సజ్జనార్ పేర్కొన్నారు.

**"బాధల పుస్తకానికి నవ్వుల అట్టలేసుకుంటాడు**
**తననీ తానే ఇంటికి కట్టేసుకుంటాడు**
**అందరి ప్రాణం గుప్పెడు గుండెల్లో ఉంటే**
**నాన్న ప్రాణం ఇంట్లో అణువణువునా ఉంటుంది"..!!**
**- రాధికా ప్రియ**

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



## చేపల వేట.. ప్రమాదంతో ఆట

**కోదాడ,తెలంగాణ ముచ్చట్లు:**

అధికంగా చేపలు పట్టి అమ్ముకోవాలని ఒకరు.. ఇంట్లోకి కూర కోసం మరొకరు.. మద్యం తాగిన మైకంలో ఇంకొకరు.. సందర్భమేదైనా విద్యుత్తును ఉపయోగించి చేపలు పట్టడం చాలా ప్రమాదకరం. కాస్త ఏమరపాటుగా ఉన్నా ప్రాణాలు కోల్పోవాల్సిందే. కళ్లెదుటే ఎన్నో ఘటనలు జరుగుతున్నా కొందరు వ్యక్తులు వాటిని లెక్కచేయకుండా విద్యుత్ అమర్చిన గాలంతో చేపలను వేటాడుతున్నారు. కోదాడ పట్టణంలోని పెద్ద చెరువు నుంచి పాలేరు వాగును కలిపే ఉల్క చెరువులో ఇది నిత్య కృత్యమే. మంగలితండా, నల్లబండగూడెం, అనంతగిరి మండలం కొత్తగూడెంలో ప్రవహిస్తున్న పాలేరు వాగులో ప్రాణాలను పణంగా పెట్టి వేట సాగిస్తున్నారు. సగానికి పైగా వేటగాళ్లు మద్యం మత్తులోనే చేపలు పడుతున్నారు. అధికారులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు. కాలువలు, వాగులు, చెరువుల పక్కనే ఉండే విద్యుత్తు మోటార్లు, స్తంభాల నుంచి తీగలు లాగి చేపలు పట్టే గాలానికి అమర్చుతారు. గాలానికి ఎరను తగిలించి నీళ్లలో వేస్తారు. ఎర తినడానికి వచ్చే చేపకు విద్యుత్ తీగ తాకగానే గాలంలో పడుతుంది. ఈ ప్రక్రియలో విద్యుదాఘాతం జరిగితే ప్రాణానికే ప్రమాదం.



# ఫార్ములాఈ' కేసులో ఒకరిద్దరు జైలుకు పోవడం ఖాయం

- **ఓఆర్ఆర్ టోల్ లీజుపై విచారణకు ఆదేశించాం**
- **మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

"గత పాలకులు ఎన్నికల ముందు రైతుబంధు కోసమో.. ఇతర అవసరాల కోసమో రూ.7,380 కోట్లకు ఓఆర్ఆర్ టోల్ లీజును అమ్ముకున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో ఈ వ్యవహారంపై విచారణకు డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల కోరిక మేరకే సీఎం రేవంత్‌రెడ్డి దానిపై సిట్ వేశారు. అవకతవకలు చేసిన వాళ్లు బయటకొస్తారు. ఓఆర్ఆర్ నిర్మాణానికి ఆ రోజుల్లోనే రూ.6,500 కోట్ల ఖర్చు అయింది. అలాంటిదాన్ని కేసీఆర్ కేవలం రూ.7,380 కోట్లకు టోల్ లీజును అమ్మేయడం అత్యంత దారుణం. ఫార్ములాఈ రేసు కేసులో ఒకరో.. ఇద్దరో జైలుకు పోవడం ఖాయం" అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ అబిడ్స్‌లోని రెడ్డి బాలుర వసతిగృహ పూర్వ విద్యార్థుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రీజినల్ రింగ్ రోడ్(ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం టెండర్ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో మంత్రి స్పందించారు.

**తెలంగాణ ప్రజలకు కేంద్రం ఇచ్చిన కానుక ఆర్ఆర్ఆర్**

"ఆర్ఆర్ఆర్ 50% తెలంగాణను నగరీకరణ చేసేందుకు ఉపయోగపడే అద్భుతమైన ప్రాజెక్టు. 2017లోనే దాన్ని ప్రధాని మోదీ ప్రకటించినా గత భారాస ప్రభుత్వం ఆరేళ్లు మొద్దు నిద్రపోయింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో డిసెంబరు 9న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఆర్ఆర్ఆర్ గురించి విన్నవించా. తెలంగాణ ప్రజలకు కేంద్రం ఇచ్చిన కానుక ఆర్ఆర్ఆర్. వచ్చే మార్చిలో పనులు ప్రారంభించి.. మూడేళ్లలో పూర్తి చేస్తాం" అని తెలిపారు. ఈ ప్రాజెక్టును మంజూరు చేసిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనుల టెండర్లకు కేంద్రం నోటిఫికేషన్ వేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆదివారం ఫోన్‌లో అభినందనలు తెలిపారు.



# విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా సమ్మె విరమించండి.. మంత్రులు విజ్ఞప్తి

- **సమగ్ర శిక్ష ఉద్యోగులతో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క చర్చలు**
- **గత కొన్ని రోజులుగా తన సమస్యలు పరిష్కరించాలని సమ్మె**

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని సమ్మెను విరమించాలని కోరిన మంత్రులు.

గత 25 రోజులుగా సర్వ శిక్షా ఉద్యోగులు, కేజీబీవీ ఉపాధ్యాయులు సమ్మె చేపట్టిన సంగతి తెలిసిందే.. తమ సమస్యలు పరిష్కరించాలంటూ సమ్మెకు దిగారు. ఈ క్రమంలో.. ఉద్యోగుల ప్రతినిధులతో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎమ్మెల్సీ కోదండరాం, విద్యాశాఖ అధికారులు చర్చలు నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్ శ్రేయస్సు దృష్ట్యా తక్షణమే సమ్మె విరమించాలని మంత్రులు కోరారు. సమ్మె చేయడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని, కేజీబీవీ పాఠశాలల్లో బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుతున్నారని, విద్యార్థులను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేయవద్దని సర్వ శిక్షా ఉద్యోగులకు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క విజ్ఞప్తి చేశారు.

ఈ క్రమంలో సర్వ శిక్షా ఉద్యోగులు తమ సమస్యలను చెప్పుకున్నారు. తాము సుదీర్ఘ కాలంగా కస్తూర్బా గాంధీ పాఠశాలలో చేస్తున్నామని.. తమని రెగ్యులరైజ్ చేయడం లేదా ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కూల్ అమలు చేయాలని తెలిపారు. అయితే.. సర్వ శిక్షా కస్తూర్బా గాంధీ పాఠశాలు కేంద్రం పరిధిలో 60 శాతం, రాష్ట్రం పరిధిలో 40 శాతం ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇప్పటికే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళినట్లు తెలిపారు. సర్వ శిక్షా ఉద్యోగుల సమస్య తెలంగాణలోనే లేదని.. దేశ వ్యాప్తంగా ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కోరితే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి కేంద్రానికి ప్రతిపాదనలు పెడతామని మంత్రి పొన్నం వెల్లడించారు.

25 రోజులుగా కేజీబీవీ ఉపాధ్యాయులు సమ్మె చేయడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని.. తక్షణమే సమ్మె విరమించి ఉద్యోగులు విధుల్లో చేరాలని మంత్రులు కోరారు. సమ్మె విరమిస్తే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సబ్ కమిటీతో సమావేశానికి పిలుస్తామని మంత్రి సీతక్క తెలిపారు. నాన్ ఫైనాన్సియల్ డిమాండ్స్‌లో మహిళా ఉద్యోగులకు మెటర్నరి లీవ్స్, సీఎల్‌లు తదితర వాటిపై సాధ్యమైనంత వరకు ప్రభుత్వం పరిష్కరమయ్యేలా ప్రభుత్వం చూస్తుందని.. ఆర్థికపరమైన డిమాండ్స్ పై సబ్ కమిటీలో చర్చించిన తరువాత నిర్ణయం తీసుకుంటామని మంత్రులు పేర్కొన్నారు.

# అల్లు అర్జున్ కు నాంపల్లి కోర్టులో చుక్కెదురు!

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**



సంధ్య థియేటర్లో జరిగిన తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ చనిపోవడంతో అల్లు అర్జున్ పైన కేసు నమోదైన విషయం తెలిసిందే. ఆ తర్వాత అల్లు అర్జున్ ను అరెస్ట్ చేయడం పోలీసులు కోర్టు ముందు హాజరు పరచటం, కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో అల్లు అర్జున్ ను చంచల్ గూడా జైలుకు తరలించారు.

నాంపల్లి కోర్టులో అల్లు అర్జున్ కు చుక్కెదురు ఆ తర్వాత మధ్యంతర బెయిల్ తీసుకున్న అల్లు అర్జున్ చంచల్గూడా జైలు నుంచి బయటకు వచ్చారు. ప్రస్తుతం రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మళ్లీ కోర్టును ఆశ్రయించారు. అయితే తాజాగా అల్లు అర్జున్ కు నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. అల్లు అర్జున్ రెగ్యులర్ బెయిల్ పిటీషన్ పై తీర్పు వాయిదా పడింది.

తీర్పు వాయిదా వేసిన జడ్జి సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో నమోదైన కేసులో తనకు రెగ్యులర్ బైలు మంజూరు చేయాలని కోరుతూ నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన అల్లు అర్జున్ పిటిషన్ పైన నేడు విచారణ జరిగింది. దీనిపై విచారణ చేపట్టిన జడ్జి తీర్పును వచ్చే నెల మూడవ తేదీకి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. నేడు కౌంటర్ దాఖలు చేసిన పోలీసులు అయితే గత విచారణలో భాగంగా కౌంటర్ దాఖలు చేసేందుకు జడ్జిని సమయం కోరిన పోలీసులు ఈరోజు కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. అల్లు అర్జున్ బెయిల్ కోసం అల్లు అర్జున్ తరపు నాయవాది, బెయిల్ ఇవ్వొద్దని ప్రభుత్వం తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ క్రమంలో నిరుపక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును వచ్చేనెల మూడవ తేదీకి వాయిదా వేసింది.

**జనవరి 3 వ తేదీవరకు తీర్పు వాయిదా**

మరోవైపు నాంపల్లి న్యాయస్థానం 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించిన క్రమంలో ఈ నెల 27వ తేదీన రిమాండ్ ముగియగా అదే రోజు అల్లు అర్జున్ వర్చువల్ గా కోర్టుకు హాజరయ్యారు. అప్పుడే అల్లు అర్జున్ తరఫున రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ పై విచారణ నేటికి వాయిదా పడిగా నేడు నాంపల్లి కోర్టు విచారణ జరిపింది. ఇక దీనిపై తుది తీర్పును జనవరి మూడవ తేదీన వెల్లడించనున్నట్టు నాంపల్లి కోర్టు ప్రకటించింది.

# గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మీ ఓట్లు మీకే వేసుకోండి..

- **గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మీ ఓట్లు మీకే వేసుకోండి- కేఏ పాల్**
- **కేఏ పాల్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్**
- **వంద రోజుల్లో అభివృద్ధి చేసి చూపిస్తా- కేఏ పాల్**
- **నేను సీఎం అవుతాను.. నా సత్తా ఏంటో ఇప్పుడున్న వాళ్లకు తెలుసు.**

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**



గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మీ ఓట్లు మీకే వేసుకోండని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఇంట్రస్టింగ్ కామెంట్స్ చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తున్న ఆయన.. వంద రోజుల్లో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. తాను సీఎం అవుతానన్నారు. తన సత్తా ఏంటో ఇప్పుడున్న వాళ్లకు తెలుసని కేఏ పాల్ తెలిపారు. ఇప్పుడున్న వాళ్ళు వందల కోట్లు ఖర్చుపెట్టి లక్షల కోట్లు దోచుకున్నారు.. బంగారు తెలంగాణ అన్న కేసీఆర్ తెలంగాణను దోచుకున్నారని ఆరోపించారు. ఆయన మాటలతో వందల మందిని బలి చేశారని పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటీసీలు వేరే పార్టీ తరఫున పోటీ చేయకండి.. పార్టీలకు అతీతంగా ఏకగ్రీవం చేసుకోండని సూచించారు.

చాలా మంది కులాన్ని వాడుకొని పార్టీలు లాభం పొందారు.. బీసీలను రెండు మూడు కులాల వారు అనగదొక్కారని కేఏ పాల్ తెలిపారు. రెడ్డిలు 12 మంది సీఎంలు అయ్యారని అన్నారు. కేసీఆర్ పేరు మీద లేదా పార్టీ మీద పోటీ చేద్దామనుకునే వారు వారికంటే దరిద్రులు ఇంకా ఎవరు లేరని చెప్పారు. కేసీఆర్ లక్షల కోట్ల ఆస్తులు సంపాదించారని కేఏ పాల్ వెల్లడించారు. మరోవైపు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి కేఏ పాల్ కౌంటర్ ఇచ్చారు. పూలమ్మి.. పాలమ్మి అంత సంపాదించారా అని నిలదీశారు. ఇదిలా ఉంటే.. హైడ్రా పెద్ద డ్రామా అని ఆరోపించారు. రేవంత్, కేసీఆర్ తోడు దొంగలు అని దుయ్యబట్టారు. కేటీఆర్, రేవంత్ కొట్టుకోవడం.. తిట్టుకోవడం పెద్ద డ్రామానేనని కేఏ పాల్ అన్నారు.

మరోవైపు.. అల్లు అర్జున్ ఎవరో తనకు తెలియదని.. ఆయన పేరు కూడా తెలియదన్నారు. చిరంజీవి, కృష్ణ తెలుసని చెప్పారు. పర్మిషన్ లేనప్పుడు అల్లు అర్జున్‌ను థియేటర్ లోపలికి ఎందుకు పంపారు.. ఆ హత్యలు మీకు భాగం లేదా అని కేఏ పాల్ ప్రశ్నించారు. ప్రజాశాంతి కండువాలు కప్పుకోవాలి.. తన ఫోటో పెట్టుకుని తిరగండని అన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా గెలవండని కేఏ పాల్ తెలిపారు. రూ. 10 పెట్టి ప్రజాశాంతి పార్టీ సభ్యత్వం తీసుకోండని ప్రజలకు చెప్పారు.

# రేవంత్ ప్రభుత్వంలో అభివృద్ధిలో దూసుకెళ్తున్నాం..

- **రేవంత్ ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకు వెళుతుంది- తుమ్మల**
- **అనేక ప్రభుత్వాల్లో.. శాఖల్లో పని చేసిన సమయంలో జిల్లా అభివృద్ధి ధ్యేయంగా పని చేశా**
- **ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కడ ఏ సమస్య ఉన్న పరిష్కరించాను- మంత్రి తుమ్మల.**

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**



కాంగ్రెస్ ఏడాది కాలంలో రేవంత్ ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకు వెళుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. అనేక ప్రభుత్వాల్లో.. శాఖల్లో పని చేసిన సమయంలో జిల్లా అభివృద్ధి ధ్యేయంగా పని చేశానని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కడ ఏ సమస్య ఉన్న పరిష్కరించానని పేర్కొన్నారు. ఖమ్మం నియోజకవర్గానికి సంబంధించిన అధికారుల మార్పిడి, వరదల వల్ల కొంత కాలం ఇబ్బందులు ఏర్పడినప్పటికీ ఇప్పుడు పనులు స్పీడ్ అందుకున్నాయని వెల్లడించారు. 500 ఎకరాల్లో వెలుగుమట్ల ఎకో పార్క్ అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. జూ పార్క్ ను ఏర్పాటు చేస్తాం.. ఖమ్మంకు చారిత్రాత్మకమైన ఖిల్లా పై రోపు వే ఏర్పాటు చేస్తాం.. హైదరాబాద్ శిల్పారామం మాదిరిగా వెలుగుమట్ల, ఖమ్మం ఖిల్లాను తయారు చేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. కొత్త ఏడాదిలో పనులు ఏర్పాటు చేస్తాం.. రూ.700 కోట్లతో మున్నేరు ఖమ్మంలోకి రాకుండా చేస్తామని తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. రూ.220 కోట్లతో చెరువుల నుంచి ఖమ్మంలోకి వరద రాకుండా చేయనున్నామని.. ఖమ్మం నగరంలో రూ.220 కోట్లతో మంచినీటి సమస్య లేకుండా పథకం తీసుకొస్తామని తెలిపారు. అలాగే.. మెడికల్ కాలేజి నిర్మాణం చేయనున్నామని చెప్పారు. స్వామి నారాయణ్ ద్వారా స్కూల్ నిర్మాణం చేస్తున్నాం.. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేస్తున్నాం.. ఖమ్మం పట్టణానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేయనున్నామని అన్నారు. ఖమ్మం మున్నేరు పై కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాం.. జాతీయ రహదారుల నిర్మాణం చేస్తున్నాం.. ఖమ్మంకు ఒక్క రింగ్ రోడ్డు మాదిరిగా జాతీయ రహదారుల మీదుగా చేస్తున్నామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.


గోదావరి జలాలు పది నియోజకవర్గాలకు రావడం తన కోరిక.. దానిని పూర్తి చేయడమే లక్ష్యమని తుమ్మల చెప్పారు. సీతారామ ప్రాజెక్టు మళ్ళీ వచ్చే స్వాతంత్ర్య దినోత్సవం నాటికి యాతల కుంట టన్నెల్ పూర్తి చేసి నీళ్లు ఇస్తాం.. జగ్గయ్య పేట నుంచి వైరా మీదుగా నేషనల్ హైవే నిర్మాణం చేస్తామని అన్నారు. కొత్తగూడెం నుంచి కౌతల రోడ్ నిర్మాణం చేస్తే భద్రాచలం కనెక్టివిటీ పెరుగుతుందని తెలిపారు. రూ.3000 కోట్లతో సీతమ్మ సాగర్ పూర్తి అయితే.. పోలవరం నుంచి కాళేశ్వరం వరకు గోదావరిలో వాటర్ వేస్ ను చేయాలన్న కోరిక ఉందని అన్నారు. పాండురంగపురం నుంచి భద్రాచలం వరకు రైల్వే లైన్ నిర్మాణం పై కేంద్రాన్ని అడుగుతున్నాం.. ఎయిర్ వేస్ కొత్తగూడెంకు అవకాశం వుందని తెలిపారు. కొత్తగూడెం మైనింగ్ కాలేజీ యూనివర్సిటీగా చేయాలని కోరుతున్నామని మంత్రి పేర్కొన్నారు.



# అదుపుతప్పి బావిలో పడిన కారు

**మునుగోడు,తెలంగాణ ముచ్చట్లు:**

మూలమలుపులో ఉన్న బావిని గమనించక కారు అందులో పడిన ఘటన మునుగోడు శివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం దునెల్లి గ్రామానికి చెందిన జడిగల రాజు, పుష్పలత దంపతులతోపాటు వారి కుమారులు సిద్ధూ, లవకుమార్‌తో కలిసి కనగల్ మండలం పోనుగోడు గ్రామానికి కారులో వెళ్లారు. పని ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో మునుగోడు మండల కేంద్రం నుంచి నార్కెట్‌పల్లి రహదారి వైపు వడ్డెరిగూడెం సమీపంలో మూలమలుపు వద్ద ఉన్న బావిని గమనించకుండా నేరుగా వెళ్లడంతో కారు అందులోకి దూసుకెళ్లి లోపల పల్టీ కొట్టింది. బావిలో నీళ్లు లేకపోవటంతో కారులో ఉన్న నలుగురు కుటుంబ సభ్యులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మెల్లగా కారుపైకి ఎక్కి దాదాపుగా రెండు గంటల సేపు దానిపై కూర్చున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేసుకొని అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది తాడు సాయంతో అందులోకి దిగి వారందరిని సురక్షితంగా బయటకు తీశారు.



# స్పేడెక్స్ ప్రయోగం.. పీఎస్ఎల్వీ సీ 60 ప్రయోగం విజయవంతం

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన పీఎస్ఎల్వీసీ60 ప్రయోగం విజయవంతమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి దూసుకెళ్లిన వాహకనౌక.. టార్గెట్, ఛేజర్ ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. సరిగ్గా సోమవారం రాత్రి 10:00:15 గంటలకు నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది. స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) పేరిట జంట ఉపగ్రహాలను భూ కక్ష్యలో అనుసంధానం చేయనున్నారు. అంతరిక్షంలోనే వ్యోమనౌకలను డాకింగ్, అన్ డాకింగ్ చేయగల సాంకేతిక అభివృద్ధే లక్ష్యంగా ఈ ప్రయోగం చేపట్టింది. పీఎస్ఎల్వీ ద్వారా ప్రయోగించిన రెండు చిన్న వ్యోమ నౌకలను అంతరిక్షంలోనే ఒకదానితో ఒకటి డాకింక్ చేయించడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యం.

భూ ఉపరితలం నుంచి 470 కిలోమీటర్ల ఎత్తున వృత్తాకార కక్ష్యలో 2 వ్యోమ నౌకలు స్వతంత్రంగా ఏకకాలంలో డాకింగ్ అయ్యేలా ప్రణాళిక సిద్ధం చేశారు. చంద్రుడిపై వ్యోమగామిని దించడం, జాబిల్లి నుంచి మట్టిని తీసుకురావడం, సొంత అంతరిక్ష కేంద్రం నిర్మించాలన్న భారత్ కల సాకారం కావాలంటే.. వ్యోమ నౌకల డాకింగ్, అన్ డాకింగ్ సాంకేతికత ఎంతో అవసరమని ఇస్రో పేర్కొంది. ఈ డాకింగ్ ప్రక్రియ విజయవంతం అయితే ఈ సాంకేతికతను కలిగిన నాలుగో దేశంగా భారత్ నిలవనుంది. ఇప్పటికే అమెరికా, రష్యా, చైనా దేశాలు ఈ సాంకేతికతను కలిగి ఉన్నాయి


**జనవరి 7న డాకింగ్ జరిగే అవకాశం: సోమనాథ్**

పీఎస్ఎల్వీసీ60 ప్రయోగం విజయవంతం కావడంపై ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగంలో భాగస్వాములైన శాస్త్రవేత్తలను అభినందించారు. వాహక నౌక 2 ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు చెప్పారు. స్పేడెక్స్ శాటిలైట్లను కక్ష్యలో ప్రవేశపెట్టడం మిషన్‌లో తొలి భాగమని చెప్పారు. డాకింగ్ ప్రక్రియకు మరో వారం సమయం పడుతుందని, జనవరి 7న డాకింగ్ జరిగే అవకాశం ఉందని సోమనాథ్ తెలిపారు.

# రూపాయి గురించి స్పందించరేం..

- **ప్రధానిపై కాంగ్రెస్ విమర్శలు**

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**



రూపాయి విలువ క్షీణతను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. యూపీఏ పాలనలో రూపాయి విలువ పడిపోయినప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ ప్రవర్తించిన తీరును గుర్తు చేసింది. ఇప్పుడు ఈ విషయంలో ఆయన వద్ద ఎటువంటి మాటలు లేవని విమర్శించింది. "అమెరికా డాలరుతో పోలిస్తే మన దేశ కరెన్సీ రూపాయి విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి (85.27)కి చేరుకుంది. దీనిపై కేంద్రం స్పందించడం లేదు. 2014లో ఇదే అంశంపై నాడు గుజరాత్ సీఎంగా ఉన్న మోదీ యూపీఏ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. యూపీఏ ప్రభుత్వం దేశ రక్షణ, రూపాయి విలువ గురించి పట్టించుకోవడం లేదని నాడు ఆయన ఆరోపించారు" అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ గుర్తు చేశారు. "నాడు ఆయన చేసిన వ్యాఖ్యలను మరోసారి గుర్తు చేస్తున్నాం. సంక్షోభాలు వస్తాయి. ఆ సమయంలో ప్రభుత్వం నిస్సహాయంగా ఉంటే సంక్షోభం తీవ్రంగా మారుతుంది. ఇప్పుడు దేశ పాలకులు రక్షణ, రూపాయి విలువ పతనం గురించి ఆలోచించడం లేదు. కేవలం తమ కుర్చీని కాపాడుకునేందుకు మాత్రమే ఆలోచిస్తున్నారు" అని విమర్శించారు.

'రాజకీయ ప్రయోజనాల కోసం నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. కానీ, ప్రస్తుతం రూపాయి విలువ క్షీణత విషయంలో ప్రధాని మోదీ వద్ద ఎలాంటి మాటలు లేనట్లుగా అనిపిస్తోంది" అని అన్నారు. రూపాయి విలువను స్థిరీకరించేందుకు ఆర్‌బీఐ బిలియన్ల డాలర్ల విదేశీ మారక నిల్వలను వినియోగించిందన్నారు. ఇప్పటివరకు ఎన్ని రూ. వేల కోట్లు ఉపయోగించారని ప్రశ్నించారు.

"ప్రతి మనిషిలో
సహాయం చేసే దేవుడు ఉంటాడు
నాశనం చేసే రాక్షసుడు ఉంటాడు
రావణుడి లాంటి ఆలోచలని
రాముడిలా ధర్మం అనే బాణంతో బూడిద చెయ్యాలి" ..!!
- రాధికా ప్రియ



# అమిత్ షాను వెంటనే మంత్రివర్గం నుండి భర్తరాఫ్ చేయాలి

- సీపీఎం డిమాండ్

**జఫర్గడ్, తెలంగాణ ముచ్చట్లు :**
అంబేద్కర్ పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఉద్దేశ్య పూర్వకంగానే వ్యాఖ్యలు చేశారని, మంత్రివర్గం నుండి భర్తరఫ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య ఆరోపించారు.సోమవారం మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో అమిత్ షా వాఖ్యలను ఖండిస్తూ అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు . అనంతరం సోమయ్య మాట్లాడుతూ.... ఇప్పుడు ఈ దేశానికి రాజ్యాంగం పనికిరాదని అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మాన్ని శాస్త్రాన్ని రాజ్యాంగంలో అమలు చేయాలని కుట్రలో భాగంగానే అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాతను కించపరిచేలా, ఈ దేశ ప్రజలను అవమానించేలా, పార్లమెంటు నిస్సిగ్గుగా మాట్లాడారాని విమర్శించారు. బీహార్ అంబేద్కర్ ఆనాడే మన సంస్కృతిని వ్యతిరేకించి ఇది అమలు జరుగుతే అణగారిన వర్గాల స్థితిగతులు మరింత దయనీయంగా మారుతాయని ప్రజలను మేల్కొల్పడం కోసం తాను స్వయంగా మన సంస్కృతిని తగలబెట్టారని అన్నారు. దీన్ని జీర్ణించుకోలేని ఆర్ఎస్ఎస్ బిజెపిలో అంబేద్కర్ అన్న గిట్టడం లేదని, హిందుత్వ భావాజాలాన్ని ప్రజల్లోకి నొప్పించడం వీలు కావడం లేదని కుట్ర బుద్ధితో ఇలాంటి వ్యాఖ్యలు చేసి, దేశ ప్రజల మధ్య విభజన రేఖలు గీసి రెచ్చగొట్టి మత కల్లోలాలు సృష్టించి పగ్గం గడుపుకోవాలని చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, సిపిఎం మండల కమిటీ సభ్యులు కాట సుధాకర్ , పార్టీ నాయకులు నీరటి కొమురయ్య, ఎర్ర రవి, జి కొమురయ్య, డి లక్ష్మి, శోభ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలో ప్రతిభ కనబరిచిన ఆదర్శ పాఠశాల విద్యార్థిని

**జఫర్గడ్,తెలంగాణ ముచ్చట్లు:**
మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల మరియు కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కె.కావ్య ఈ నెల 3, 4తేదీల్లో హనుమకొండ లోని జిల్లా బాక్సింగ్ హాల్లో నిర్వహించిన అండర్19 బాల బాలికల బాక్సింగ్ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 49వెయిట్ కేటగిరిలో రాష్ట్రస్థాయిలో సిల్వర్ మెడల్ (రెండవ స్థానం) గెలుపొందినట్లు ప్రిన్సిపల్ డా.కె శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపల్ తో పాటు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బి. రాజు, ఎ శ్రీనాథ్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# ప్రజావాణిలో 140 అర్జీల స్వీకరణ

- సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**
ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన 140 అర్జీలను స్వీకరించిన హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య సంబంధిత శాఖల అధికారులను సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాల్సిందిగా ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో కలసి కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా రెవెన్యూ, నీటిపారుదల, వ్యవసాయం తదితర విభాగాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు అర్జీల రూపంలో అందజేశారు. అందిన 140 అర్జీలను ప్రాధాన్యంగా పరిశీలించి, సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో వై.వి.గణేష్, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, డీఆర్డీవో మేన శ్రీను, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుతే ఉత్తమ ఫలితాలు

- కాళోజి జూనియర్ కళాశాల చైర్మన్ ఎస్.శ్యాంసుందర్ రెడ్డి.

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు;**
ప్రతి విద్యార్థి కష్టపడి క్రమశిక్షణతో సమయపాలన పాటించి చదువుకున్నట్లయితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని కాళోజి జూనియర్ కళాశాల చైర్మన్ ఎస్ శ్యాంసుందర్ రెడ్డి అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ 55వ డివిజన్ పరిధి భీమారంలోని జగతి గార్డెన్ లో కాళోజీ జూనియర్ కళాశాల 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ ఎస్ శ్యాంసుందర్ రెడ్డి, ప్రిన్సిపాల్, వైకెఎస్, డైరెక్టర్లు, సరస్వతి దేవి చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మాట్లాడుతూ కాళోజి జూనియర్ కళాశాల స్థాపించి 11 సంవత్సరాల కాలంలో ఐదువేల మంది విద్యార్థులను వివిధ శాఖలలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారని గుర్తు చేశారు. మా కళాశాలలో చదువే విద్యార్థులందరూ అభివృద్ధి చెందాలని లక్ష్యంతో విద్యార్థులకు బోధన అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని కష్టపడి చదువుతే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు.అనంతరం ప్రిన్సిపాల్. వై కే ఎస్, మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను నైతిక విలువలను పెంపొందించుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కే తిరుపతిరెడ్డి, ఇ.అనిల్ రెడ్డి, టి.మధుకర్ రెడ్డి, ఎం సంతోష్ కుమార్, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# ఎగుమతయ్యే ఉత్పత్తులను మరింత పెంచేందుకు అన్ని వసతులు కల్పిస్తాం

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**
జిల్లా నుంచి ఎగుమతి అయ్యే ఉత్పత్తులను మరింత పెంచేందుకు అన్ని రకాల వసతులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు.సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎగుమతుల పరిమాణాలను అసోసియేషన్ ద్వారా సేకరించి నివేదిక రూపంలో అందించాలని, ముఖ్యంగా బియ్యం, గ్రానైట్, మిరపకాయలు, టెక్స్టైల్ ఉత్పత్తుల ఎగుమతులపై దృష్టి పెట్టాలని సూచించారు. రైతులు నాణ్యమైన ఉత్పత్తులు అందించి అంతర్జాతీయ మార్కెట్లో పోటీతత్వాన్ని పెంచేందుకు అవగాహన కల్పించాలని, అలాగే ఎగుమతి దారుల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు నివేదికలను సమర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, డీజీఎఫ్టీ ఉపసంచాలకులు శైలజ (వర్చువల్‌గా), ఎల్‌డీఎం శ్రీనివాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రధర్ రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# మెప్మా ఆధ్వర్యంలో స్టాల్ ఏర్పాటు

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**
పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో సోమవారం స్టాల్ ను ఏర్పాటు చేశారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల ప్రతినిధులు తయారు చేసిన కాటన్ దుస్తులు, పచ్చళ్ళు, కాటన్ బ్యాగులు విక్రయించేందుకు ఏర్పాటు చేసిన స్టాల్ ను డీఆర్వో వై. వి. గణేష్, జడ్పీ సీఈవో విద్యాలత, ఇతర అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు రజిత రాణి తదితరులు పాల్గొన్నారు.

# క్లినికల్ అప్రెంటిస్ షిప్ శిక్షణ కొరకు జనవరి 6లోగా దరఖాస్తు చేసుకోవాలి...

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి
- కె. రవిబాబు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
ఇంటర్మీడియట్ ఎం.ఎల్.టి. ఒకేషనల్ కోర్సులలో మార్చి 2020 సంవత్సరం నుండి ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులకు ఒక సంవత్సరం క్లినికల్ అప్రెంటిస్ షిప్ శిక్షణ సత్తుపల్లి, మధిర, తిరుమలయపాలెం ఏరియా ఆసుపత్రిలలో అందించనున్నట్లు, శిక్షణకు ఎంపికైన వారు ఒక వేయి రూపాయలు డి.డి. రూపంలో చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసుకోని, ఎంపిక కాని వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే. రవి బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తిగల విద్యార్థిని, విద్యార్థులు తమ బయోడేటా ఫారంతో పాటు పది రూపాయల పోస్టల్ స్టాంప్ అతికించిన స్వంత చిరునామా కవర్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను జతపరిచి కలెక్టరేట్ లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో జనవరి 6 లోగా అందజేయాలని రవిబాబు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# జనవరి 20 లోగా పెండింగ్ ఉపకార వేతన దరఖాస్తు ఫారాలు అందించాలి...

- జిల్లా బి.సి. అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**
వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలోనీ ప్రభుత్వ, ప్రైవేటు, యూనివర్సిటీ ఇంజనీరింగ్, నర్సింగ్ కళాశాలలు 201718 నుండి 202324 సంవత్సరాల వరకు పెండింగ్ లో ఉన్న ఉపకార వేతనాలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను జనవరి 20లోగా అందజేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ లో రెండవ అంతస్తులో ఉన్న జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో పెండింగ్ దరఖాస్తులను అందజేయాలని, ట్యూషన్ ఫీజులకు సంబంధించి చాలా అప్లికేషన్లు నోఫీజు అని ఈపాస్ వెబ్ సైట్లో చూపించడం జరుగుచున్నదనీ, కళాశాలల యాజమాన్యం వారు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ లో, పియంయు సెంటర్ లో సంప్రదించి ఫీస్ట్రక్చర్ ను ఈపాస్ వెబ్ సైట్లో అప్డేట్ చేయించు కోవాలని, ఫీజు స్ట్రక్చర్ ను అప్డేట్ చేయని కళాశాలలకు ట్యూషన్ ఫీజు రాకపోతే సంబంధిత కళాశాలల యాజమాన్యం వారు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని, అట్టి వారిపై శాఖాపరమైన చర్యల కోసం పై అధికారులకు సిఫారసు చేయడం జరుగుతుందని జి. జ్యోతి ఆ ప్రకటనలో తెలిపారు.

# ఏడుపాయల వన దుర్గమ్మను దర్శించుకున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి

**పాపన్నపేట,తెలంగాణ ముచ్చట్లు:**
పాపన్నపేట మండలపరిధిలో ని శ్రీ ఏడుపాయల వనదుర్గమ్మను మంత్రి దామోదర్ ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా అనంతరం ప్రత్యేకపూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కాంగ్రెస్ నాయకులు ఏడుపాయల పాలకమండలి మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు





# ఆపరేషన్ స్మైల్' ఎక్స్ ఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**
రాష్ట్ర వ్యాప్తంగా బాల కార్మికులు, తప్పిపోయిన పిల్లలను గుర్తించడం,అక్రమ రవాణా కు గురైన చిన్నారులను రక్షించి,వారికి పునరావాసం కల్పించేందుకు చేపడుతున్న 'ఆపరేషన్ స్మైల్'XI కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమా రాజేశ్వరి అన్నారు. 2025 జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించే పదకొండవ 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమంలో భాగంగా జిల్లాల పోలీసు, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమం, కార్మిక, విద్య మరియు ఆరోగ్య శాఖలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, ఎన్జీవో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ నుండి అడిషనల్ డీసీపీ ఆడ్మిన్ నరేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ మాట్లాడుతూ... బాలకార్మికులు, చిన్నారుల దుర్భర స్థితిలో ఉండే ప్రాంతాలను తెలుసుకొని వాటిని బ్లాక్ స్పాట్లుగా గుర్తించి చిన్నారులను విముక్తి కలిగించాలన్నారు. ప్రధానంగా రైల్వేస్టేషన్లు, బస్స్టేషన్లు, ట్రాఫిక్ కూడళ్లు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు, టీస్టాళ్ళు, దుకాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఆపరేషన్ స్మైల్లో చైల్డ్ ట్రాక్ పోర్టల్, ముఖ కవళికలను గుర్తించే దర్పణ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా సత్ఫలితాలనిచ్చిందని అన్నారు. అనేక మంది తప్పిపోయిన పిల్లలను దర్పణ్ అప్లికేషన్ సాయంతో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారని అన్నారు. ఇతర రాష్ట్రాల చిన్నారుల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులకు అప్పగించారని అన్నారు. పిల్లలను అక్రమంగా తరలించే వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారని అన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆధ్వర్యంలో చిన్నారులను రక్షించేందుకు ఒక్కొక్క డివిజన్ లో ఒక సబ్ ఇన్స్పెక్టర్, ఇద్దరు ఏఎస్సై ఇద్దరు కానిస్టేబుళ్లు (మహిళా అధికారితో సహా)తో కూడిన ఐదుగురు సభ్యులతో కూడిన బృందాలు తనిఖీలు చేస్తున్నట్లు అడిషనల్ డీసీపీ నరేష్ కుమార్ తెలిపారు. మైనర్లను ఇంటి పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని అన్నారు.

# నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదు

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
నూతన సంవత్సర వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని హార్దిక శుభాకాంక్షలు తెలుపుతూ ..ఖమ్మం కమిషనరేట్ లో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సున్నితమైన ప్రాంతాలలో పోలీసు పికెట్ లతో పాటు మతపరమైన ప్రార్థనా స్థలాలు, ప్రధాన రహదారులు, సినిమా థియేటర్లు, లకారం ట్యాంక్‌బండ్, వెలుగుమట్ల అర్బన్ పార్కు తదితర పబ్లిక్ పార్కుల్లో పోలీసు పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువత ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్. తగ్గించేందుకు ప్రధాన రహదారులపై వెహికల్ చెకింగ్ నిర్వహించాలని, బాణసంచా పేల్చడాన్ని నిషేధించాలి. పోలీస్ అధికారులకు ఆదేశించిట్లు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని నూతన సంవత్సర మొదటి రోజు ఏ కుటుంబం విషాదకర ఘటనతో ఆరంభం కాకుండా అన్ని జాగ్రతలు తీసుకోవాల్సిందిగా సూచించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ యుక్త వయసు పిల్లలకు, మరీ ముఖ్యంగా మైనర్ పిల్లలకు, బైక్స్/ కార్లను ఇస్తే అయా వాహనాలను నిర్లక్ష్యంగా లేక మద్యం,మత్తు పదార్థాలు సేవించి నడపడం వలన ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది కాబట్టి ఈ విషయంలో తల్లితండ్రులు అప్రమత్తతో ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డ్రంకెన్ డ్రైవింగ్ తనిఖీలు తో పాటు ప్రమాదకరంగా వాహనాలు నడిపేవారు కోసం ప్రత్యేక పోలీస్ బృందాలను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.కాబట్టి 31వ తేదీ అర్ధరాత్రి ఒంటిగంట తరువాత ఎవరైనా రోడ్లపై అనవసరంగా సంచరిస్తూ ఉండే వారిపై న్యూసెన్స్ కేసు బుక్ చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. దయచేసి ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి వేడుకలను అర్ధరాత్రి ఒంటిగంటలోపు పూర్తిచేసుకుని ఇళ్లకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. అంతే కాకుండా నూతన సంవత్సర వేడుకల పేరుతో ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా రోడ్లపై న్యూసెన్స్ చేసినా, ఈవ్ టీజింగ్ లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టప్రకారం వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. పూర్తి శాంతియుత, ఆహ్లాదకరమైన వాతావరణం లో నూతన సంవత్సర వేడుకలు సంతోషంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర సమయంలో డయల్ 100 చేయాలని సూచించారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక





## గ్రామీణంలోనూ
# జీవన శైలి వ్యాధుల విజృంభణ

- సీనియర్ వైద్య నిపుణలు డా. ఎ.వి.గిరిసింహారావు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

పట్టణ ప్రాంతాలతో సమానంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ షుగరు, బిపి,కొలెస్ట్రాల్,థైరాయిడ్ అధిక బరువు లాంటి జీవనశైలి వ్యాధులు ఎక్కవగా వ్యాప్తి చెందుతున్నాయని అప్రమత్తతో ఉండాలని సీనియర్ వైద్య నిపుణులు డా. ఎ.వి గిరిసింహారావు సూచించారు. చింతకాని మండలం కొదుమూరు గ్రామం వందనం శివారులోని 'రుషివనం' లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం మరియు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ దీర్ఘ కాలిక వ్యాధులు ప్రబలడానికి కారణం నగరీకరణ ,యాంత్రిక జీవన విధానం, ఒత్తిడి, అనువంశికత కారణాలని క్రమం తప్పని వ్యాయామం ఒత్తిడిని అధిగమించడం ఆహారంలో మార్పులు వంటి జాగ్రత్తల ద్వారా ఈ వ్యాధులను అదుపులో ఉంచుకోవచ్చని తెలిపారు. పొగతాగడం.గంజాయి.మద్యపానం వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండాలనివీటివలన కూడా చిన్నవయసులోనే గుండె జబ్బులు వస్తున్నాయని చెప్పారు. వరుసగా గత ఆరు సంవత్సరాల నుండి ఋషి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'దీపమ్' డయాబెటిక్స్ ఎడ్యుకేషన్ ఎంపవర్మెంట్ ప్రివెన్షన్ అవేర్నెస్ మేనేజ్మెంట్స్పూర్తితో ఈ కార్యక్రమం నిర్వహిస్తూ దాదాపు 200 మందికి ఉచిత వైద్య పరిక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఋషి ఫౌండేషన్ బాద్యులు డా.ఎ.వి గిరిసింహారావు,వరలక్ష్మి, హరికిషన్ రావు,భారతీదేవి పాల్గోన్నారు వాలంటీర్స్ ముజీబ్, మినాజ్, బుచ్చిబాబు,శ్రవణ్,వెంకటేష్, రామకృష్ణ.గ్రామ ప్రముఖులు కృష్ణయ్య,ముత్తయ్య,సూర్యం పాల్గొన్నారు



## పుడమిరత్న జాతీయ విశిష్ట సేవా పురస్కారాన్ని
# అందుకున్న పత్తిపాటి లక్ష్మీ కాంతమ్మ

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారిణి పత్తిపాటి లక్ష్మి కాంతమ్మ పుడమిరత్న సేవా అవార్డును అందుకోవటం జరిగినది ఈ కార్యక్రమాన్ని పుడమి రత్న ఫౌండర్ బాల్ రెడ్డి మరియు మానవ హక్కుల పరిరక్షణ చైర్మన్ హైమావతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వనజీవి రామయ్య దంపతులు మరియు పద్మావతి లాయర్ హాజరైనారు దీనిలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాలలో వివిధ రంగాలలో అనగా స్వచ్ఛంద సంస్థలు రచయితలు కవులు కళాకారులు ఉపాధ్యాయులు లాయర్లు ఇంకా ఎన్నో రంగాలలో ఘనత సాధించినటువంటి వారిని ఈ పురస్కారానికి ఎన్నిక చేసినారు ఇందులో భాగంగా సామాజిక సేవకురాలు మరియు కళా రంగంలో దూసుకుపోతున్నటువంటి పత్తిపాటి లక్ష్మీకాంతమ్మ నీ ఈ వేదిక పైన ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమము ప్రారంభికులైనటువంటి పుడమి డైరెక్టర్ బాల్ రెడ్డి ఆరో సంవత్సర వార్షికోత్సవం సందర్భంగా దాదాపుగా 70 మందికి పైగా సన్మానాలు అందుకోవటం జరిగినది. ఈ కార్యక్రమం నిర్వహించిన బాల్ రెడ్డి కి హైమావతి కి ప్రత్యేక ధన్యవాదములు పుడమిరత్న అవార్డు గ్రహీత పత్తిపాటి లక్ష్మి కాంతమ్మ తెలిపారు



# బడికి సమయానికి రాని ఉపాధ్యాయుడు

- పాఠశాలలో వంట మనిషి భర్త ఉపాధ్యాయుడిగా మారిన వైనం..?
- అన్ని తెలిసి కూడా సర్దుకుపోతున్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు..?
- చూసి చూడనట్లుగా వివరిస్తున్న మండల విద్యాధికారి..?
- మారుమూల గ్రామాలలో దిగజారుతున్న విద్యా ప్రమాణాలు నష్టపోతున్న విద్యార్థులు..!
- ప్రభుత్వం పేద పిల్లల విద్యకు కోట్లు ఖర్చు చేస్తున్న ఫలితం మాత్రం శూన్యం..!!

**టేక్మాల్ డిసెంబర్, తెలంగాణ ముచ్చట్లు:**



విద్యార్థులు చదువుల కోసం పాఠశాలలకు వెళ్తున్నా. ఉపాధ్యాయులు మాత్రం సమయానికి రారు విద్య బోధన చేయరు సంబంధిత విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లేక ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా రావడం పోవడం మామూలు అయిపోయిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లుపేట కాంప్లెక్స్ పరిధిలోని దండు వాణి కుంట తాండ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు సమయపాలన పాటించకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. ఆ పాఠశాల ఉపాధ్యాయుడి నిర్వాకం చూస్తే ఔరా అనిపించక తప్పదేమో ఆయన విధులకు బదులు పాఠశాలలో వంట చేసే భర్తనే బడిపంతులుగా విధులు నిర్వహిస్తున్న వైనం సోమవారం వెలుగు చూసింది. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంతో పాటు తమ నిర్లక్ష్య వైఖరిని చూపుతూ తమ విధులకు బదులు ఎవరైతే నేమ్ విధులు చేస్తే చాలు అనుకున్నాడేమో ఆ ప్రబుద్ధుడు ఏకంగా వంటమనిషి భర్తనే ఉపాధ్యాయుడిగా మార్చి ఉపాధ్యాయుడి కుర్చీపై కూర్చోబెట్టి విద్యార్థులకు పాఠాలు బోధించేలా ఉందంటే ఆయన నిర్లక్ష్యానికి ఈ దృశ్యం ఉదాహరణే కాకపోదు ఇందుకు మండల విద్యాధికారులు వారి సహాయ సహకారాలు పుష్కలంగా అందిస్తూ నిర్లక్ష్యాన్ని ఇలాగే పెంచి పోషిస్తున్నారు. అన్న సందేహం లేదనే చెప్పొచ్చు. ఏది ఏమైనా టేక్మాల్ మండల విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం ఐ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్ధకంగా మారుస్తుందని పలువురు విద్యావేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . పాఠశాలలను పర్యవేక్షించాల్సిన మండల అధికారులు మామూళ్ల మత్తులో నిద్రిస్తున్నారో లేక ఉపాధ్యాయులు వహిస్తున్న నిర్లక్ష్యానికి నీరు పోస్తున్న రేమో వారికే తెలియాలి. అన్న ప్రశ్న ప్రజల్లో నెలకొంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి మరీ..



## ప్రజావాణి ఫిర్యాదులను
# ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి


**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి జిల్లా కలెక్టర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వచిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, ఆర్ డి ఓ తో కలిసి ప్రజల నుంచి అర్జీలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రసంగిస్తూ ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించటంలో అధికారులు అలసత్వం ప్రదర్శించరని వద్దని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలి ఆదేశించారు. జిల్లా ప్రజావాణి ఫిర్యాదులతో పాటు ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన ఫిర్యాదులను సైతం వారం లోపు పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ఫిర్యాదులు మొత్తం 37 అర్జీలు వచ్చాయి కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి. వనపర్తి జిల్లా అదునపు లోకల్ బాడీస్ స్థానిక సంస్థల కలెక్టర్ సంచిత్ గంగవార్. వనపర్తి జిల్లా అదనపు (రెవిన్యూ) కలెక్టర్ వెంకటేశ్వర్లు. వనపర్తి జిల్లా మీడియా పౌర సమాచార అధికారి సీతారాం నాయక్. వనపర్తి ఆర్డీవో సుబ్రహ్మణ్యం. తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరం వేడుకలు
# ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఇచ్చోడ ఎస్సై తిరుపతి

**ఆదిలాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**



నూతన సంవత్సరం వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని ఇచ్చోడ ఎస్సై తిరుపతి ప్రజలకు సూచించారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత పోలీసు పికెటింగ్, రాత్రి గస్తీలు, వాహనాల తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు ఇంట్లోనే కుటుంబ సభ్యులతో వేడుకలు జరుపుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు, కేక్ కటింగ్లు, డీజేలు, లౌడ్‌స్పీకర్లు ఉపయోగించరాదని అన్నారు.అర్ధరాత్రి తర్వాత రహదారులపై సంచారం చేయరాదని, గుమిగూడి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. మహిళలు, యువతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడపడం నిషేధమని, లైసెన్స్ లేకుండా ర్యాష్‌డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ చేసినవారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మద్యం దుకాణాలు ప్రభుత్వం విధించిన సమయానికి మాత్రమే కొనసాగాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. బాణసంచా కాల్చడం, ప్రజల శాంతి భద్రతకు ఆటంకం కలిగించే కార్యకలాపాలు చేపట్టకూడదని ఎస్సై తిరుపతి సూచించారు.

## డాక్టరేట్ సాధించిన
# కంచనపల్లి యువకుడు

**స్టేషన్ ఘనపూర్ , తెలంగాణ ముచ్చట్లు:**



“చదువు మాత్రమే నిజమైన సంపద” అని నమ్మిన కంచనపల్లి యువకుడు, అనేక కష్టాలను ఎదుర్కొని రసాయన శాస్త్రంలో పీహెచ్ డి పూర్తి చేసి డాక్టరేట్ పొందాడు. రాజస్థాన్ రాష్ట్రంలోని మేవార్ విశ్వవిద్యాలయం చైర్ పర్సన్ చేతులమీదుగా ఈనెల 21న అతను డాక్టరేట్ పట్టా అందుకున్నాడు.

కంచనపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ లడే సోమాజీ, రఘునాథపల్లి మండలం, జనగామ జిల్లా నుంచే రావడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్న సోమాజీ, 5 కిలోమీటర్ల దూరం ఎరిగే కాలినడక ప్రయాణాన్ని అలవాటు చేసుకున్నాడు.పార్టీటైమ్ జాబ్స్ చేస్తూ, జనగామలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ కోర్సులో ప్రథమ స్థానాన్ని సాధించి,ఖైరతాబాద్‌లో డిగ్రీ పూర్తి చేశాడు. తర్వాత వివాహం చేసుకుని కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ, ఎన్ఐటీ వరంగల్ నుంచి రసాయన శాస్త్రంలో మాస్టర్స్ పూర్తి చేశాడు.

పని, చదువుకు సమయం కేటాయించి, రాజస్థాన్‌లోని మేవార్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్ డి పూర్తి చేసి, 21వ తేదీన డాక్టరేట్ పట్టాను అందుకున్న సోమాజీ, జివికె బయో, డాక్టర్ రెడ్డిస్ లేబరేటరీస్ వంటి ప్రఖ్యాత సంస్థల్లో పనిచేసి, ప్రేరణకు నిలిచాడు.తన నిబద్ధత, కృషి, లక్ష్యానికి ఉన్న పట్టుదల ఈ రోజుల్లో ఎంతోమందికి ఆదర్శంగా మారింది.



# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్.

**మెదక్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ తెలంగాణ ముచ్చట్లు:**

ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం మెదక్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో సంబంధిత అధికారులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా (72) ఆర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యలపై తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ధరణి 18, పింఛన్లు04, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు18, రుణమాఫీ 07 ఇతర సమస్యలు 25 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ భుజంగరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులు
# సత్వరమే పరిష్కరించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెనుబల్లి మండలం మర్లకుంట గ్రామానికి చెందిన జే. కోటేశ్వర్ రావు తాను ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నానని, తనకు అవుట్సోర్సింగ్ లో ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కూసుమంచి మండలం పోచారం గ్రామానికి చెందిన కె. రమేష్ తన తాత గారు పోచారం గ్రామానికి వి.ఆర్.ఏ. గా పనిచేసి ఆ ఉద్యోగం తన తండ్రికి ఇచ్చారని, ప్రస్తుతం తన తండ్రికి ఆరోగ్యం బాగా లేనందున ఈ ఉద్యోగాన్ని తనకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ పరిపాలన అధికారికి రాస్తూ అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన డి. మల్లిఖార్జున్ రావు గత పది సంవత్సరాలుగా గ్రామ పంచాయతీలో పంప్ ఆపరేటర్ గా పని చేస్తున్నానని, 2021 లో అనారోగ్య కారణంగా పంచాయతి కార్యదర్శికి లేఖ రాసి సెలవు తీసుకున్నానని, ప్రస్తుతం తనకు గ్రామ పంచాయతీలో మల్టీ పర్పస్ వర్కర్ గా ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరం 43వ డివిజన్ ఎన్.ఎస్.పి. రోడ్డుకు చెందిన ఎం. రమాదేవి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈఈ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు .ఈ కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో అరుణ, తదితరులు పాల్గొన్నారు



## కర్నే తండా లిఫ్ట్ ఇరిగేషన్
# సబ్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



జీవో ఆర్టీ నంబర్ ప్రకారం ఉత్తర్వులు ప్రభుత్వం జారీ చేసింది .రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర విద్యుత్ శాఖ మాత్యులు మల్లు భట్టి విక్రమార్క, ఉత్తంకుమార్ రెడ్డి గారికి వనపర్తి ఎమ్మెల్యే తుడి మెగారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.కర్నే తండా లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించిన విద్యుత్ ఉప కేంద్రాన్ని వెంటనే మంజూరు చేయాలని కోరుతూ వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సమర్పించిన విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి , రాష్ట్ర విద్యుత్ శాఖ మాత్యులు స్పందించి ఉపకేంద్ర నిర్మాణానికి సంబంధించి రూ 1 కోటి 63 లక్షల రూపాయలను మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో ఆర్ టి నంబర్ 345 ప్రకారం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి గారు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారికి, విద్యుత్ శాఖ మాత్యులు , మల్లు భట్టి విక్రమార్క గారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణంతో కర్నే తాండ లిఫ్ట్ ప్రారంభమవుతుందని దాంతో..ఖిల్లా ఘనపూర్ లోని జంగమ్మయాపల్లి,దొంతికుంటా తండా కర్నె,తండా షాపుర్, మామిడామాడా, లట్టుపల్లి లోని 6 తాండలకి 4400 ఎకరాలు ఆయకట్టుకు సాగునీరు అందజేయవచ్చునని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఈ ఉపకేంద్ర నిర్మాణానికి కావలసిన నిధులు మంజూరు చేయడానికి కృషిచేసిన జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ గారికి, జిల్లా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు గారికి, పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి గారికి , ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
మంగళవారం 31–12–2024




# పోలీసులు ప్రజలతో సన్నిహితంగా మెలగాలి

- ఖాజీపేట డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పుప్పాల తిరుమల్

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు;**

వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం హసన్ పర్తి పోలీస్ స్టేషన్ ను ఖాజీపేట డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పుప్పాల తిరుమల్ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ కు చేరుకున్న ఏసీపికి పోలీస్ అధికారులు మొక్కలను అందజేసి స్వాగతం పలకరు. ముందుగా ఖాజీపేట డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం సిబ్బంది కి పోలీస్ శాఖ మంజూరు చేసిన కిట్ ఆర్టికల్స్ ను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరును పరిశీలించడంతో పాటు వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం జరిగిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్, రౌడీ షీటర్ల ట్రిపుల్ సి పిర్యాదులపై తీసుకుంటున్న చర్యలు, అలాగే కోర్ట్ లో పెండింగ్ లో వున్న కేసులు, వాటికి సంబందించిన దర్యాప్తు వివరాలను స్టేషన్ ఇన్స్ స్పెక్టర్ చేరాలును అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ లో నిర్వహిస్తున్న పలురకాల రికార్డులను పరిశీంచారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఖాజీపేట డివిజన్ మాట్లాడుతూ శాంతి భద్రత నియంత్రణ కై పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, ప్రజల భద్రత మనందరి బాధ్యతని, ప్రధానంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిఘా పెట్టాలని,ముఖ్యంగా పోలీస్ స్టేషన్ కు అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, సమస్యతో పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని వారిలో కలిగించాలని అన్నారు. ఫిర్యాదు వచ్చి వెంటనే స్పందించాలని, ప్రజలకు పోలీసులపై వున్న నమ్మకానికి తగ్గాటుగానే పోలీసులు నిజాయితీ తో పనిచేయాలని తెలిపారు. చివరగా ఏసీపి చేతులమీదుగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు.ఈ తనిఖీల్లో, ఇన్స్ స్పెక్టర్ వి. చేరాలు, ఎస్సైలు రవి, సిద్దయ్య తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా ఎలాంటి ఈవెంట్స్ నిర్వహించరాదు

- హసన్ పర్తి ఇన్స్పెక్టర్ వి.చేరాలు.

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు;**



బహిరంగ ప్రదేశాలలో అనుమతులు లేకుండా నూతన సంవత్సర వేడుకలు జరుపరాదని హసన్ పర్తి పోలీస్ ఇన్స్పెక్టర్ వి.చేరాలు తెలిపారు.పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందని మద్యము సేవించి ,అతివేగంగా అజాగ్రత్తగా రోడ్లపై వాహనాలు నడపరాదని రహదారులపై వీధులలో అనుమతులు లేకుండా ఎలాంటి ఈవెంట్స్ నిర్వహించరాదన్నరు. అనుమతులు లేకుండా బహిరంగ ప్రదేశాలలో డిజేలు,ఎలాంటి సౌండ్ సిస్టంలను వాడరాదని మోటార్ సైకిల్స్ రాష్ డ్రైవింగ్,ట్రిపుల్ డ్రైవింగ్ మీద కఠిన చర్యలు ఉంటాయని ఎలాంటి గొడవలకు దిగిన కఠినమైన యాక్షన్ తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఎక్కడ కూడా రాత్రుళ్ళు గుమి గూడి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధమని ప్రజల రక్షణ కోసం ప్రతి జంక్షన్ లోనూ రహదారులపై పోలీసు నిఘా బందోబస్తు ఉంటుందని మైనర్ డ్రైవింగ్ పై చాలా కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.హసన్ పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

# సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకుందాం

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,ఐపిఎస్

**వరంగల్,తెలంగాణ ముచ్చట్లు:**



సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,ఐపిఎస్ ప్రజలకు సూచించారు. నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలు ప్రశాంతవంతమైన వాతవరణంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోనేందుకు పలు సూచనలు చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సోమవారం ప్రకటన విడుదల చేసారు. డిసెంబర్ 31 రాత్రి నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో స్థానిక పోలీసులతో పాటు ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, క్రైమ్, షీ టీమ్స్‌తో పాటు పెట్రోలింగ్ విభాగాలకు చెందిన పోలీసులు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తారు. ముఖ్యంగా ఈ వేడుకలను ప్రజలు అర్థరాత్రి 12.30 గంటల లోపు ముగించుకోవాల్సి వుంటుందని. ఈ నూతన సంవత్సర వేడుకుల సందర్భంగా ఏర్పాటు చేసే సంస్కృతిక కార్యక్రమాలకు నిర్వహకులు తప్పనిసరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తు అనుమతులు తీసుకోవడంతో పాటు, వేడుకలు నిర్వహించుకునే ప్రాంతంలో ఎలాంటి అశ్లీల నృత్యాలకు అనుమతి లేదని, అలాగే కార్యక్రమాల నిర్వహణ ప్రదేశంలో తప్పనిసరిగా సిసి కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు సెక్యూరీటీ సిబ్బంది ఏర్పాటు చేసుకోవాల్సి వుంటుందని, ఈ వేడుకలు జరిగే సమయంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఇండ్ల వారికి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని, వేడుకల్లో ఎలాంటి మత్తు పదార్థాల వినియోగించడం లాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని, ప్రధానంగా ఈ వేడుకల వేళ యువకులు మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనీఖీల్లో పోలీసులకు చిక్కితే జరిమానతో పాటు జైలు శిక్ష విధించబడుతుందని, అలాగే వేగంగా వాహనాలు నడపడం, రోడ్లుపై వెళ్ళేవారిని ఇబ్బందికి గురిచేసే వ్యవహరిస్తే సదరు వాహనదారులకు చట్టపరమైన తిప్పలు తప్పవని, రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు రాకుండా ట్రాఫిక్ సిబ్బందితో పాటు స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ట్రై సిటితో పాటు, గ్రామీణ ప్రాంతాల్లోను ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనీఖీలు నిర్వహించబడుతాయని అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే వారిపై తగు చర్యలు తీసుకోబడుతుందని పై ఆంక్షలను ఎవరైన అతిక్రమించిన, ఉల్లంఘించినట్లుగా ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 నంబర్‌కు సమాచారం అందించడం ద్వారా తక్షణమే స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని, ఈ వేడుకలను ప్రజలు, యువత తమ ఇండ్లలోనే తమ కుటుంబ సభ్యులతో కల్సి సంతోషకరమైన వాతరణంలో నిర్వహించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.

# మెదక్ జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు

- జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

**మెదక్, తెలంగాణ ముచ్చట్లు**



జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 31న విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు ఉంటాయని ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకుందాం అన్నారు నూతన సంవత్సరం సందర్భంగా డీజేలు, అదిగ శబ్దం వచ్చే సౌండ్ బాక్స్ లను ఉపయోగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలపారు

# భూ భారతితో భూ సమస్యలు మొత్తం పరిష్కారం కావు

- సమగ్ర భూసర్వే చేపట్టాలి
- మంత్రి వర్గ ఉప సంఘం సమావేశాలు పేరుతో రైతు భరోసా జాప్యం తగదు
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

**సత్తుపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**



రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి 2024 కేసిఆర్ ప్రభుత్వం రూపొందించిన ధరణి 2020 కంటే మెరుగైన ఆర్వో ఆర్ గా ఉండవచ్చు కానీ భూ సమస్యలు మొత్తం పరిష్కారం చేయలేదు అని , సమగ్ర భూ సర్వే మాత్రమే భూ సమస్యలు కు సమగ్ర పరిష్కారం అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. సోమవారం ఖమ్మం సుందరయ్య భవన్లో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన రైతు సంఘం సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో లో భూములు సమగ్ర సర్వే నిజాం కాలంలో జరిగింది అని అప్పటి నుంచి భూములు అనేక మంది చేతులు మారి పట్టా ఒకరు పేరుతో ఉండి సాగులో మరొకరు ఉన్న పరిస్థితుల్లో సమగ్ర సర్వే చేసి అనుభవం ఆధారంగా హద్దులు నిర్ణయించి ప్రతి కమతానికీ భూధార్ నెంబర్ ఇచ్చి పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలని కోరారు . కొత్తగా ల్యాండ్ ట్రైబ్యునల్ ఆహ్వానించే పరిణామం అన్నారు, అనుభవదారు కాలం తోపాటు కౌలు రైతుల గుర్తింపు కూడా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది అన్నారు. రైతు భరోసా విధివిధానాలు రూపకల్పన పేరుతో మంత్రి వర్గ ఉపసంఘం సమావేశాలు పేరుతో కాలయాపన చేయకుండా రైతు భరోసా తక్షణమే విడుదల చేయాలి అని రాంబాబు డిమాండ్ చేశారు, శాటిలైట్ చాయా చిత్రాలు ఆధారంగా రైతు భరోసా ఇవ్వడానికి వానాకాలం పంట, రబీ సీజన్లో పంట ఎలా పరిగణలోకి తీసుకుంటారు అని అన్నారు, స్థానిక వ్యవసాయ అధికారులు సాగు సర్వే ప్రకారం రైతు భరోసా రెండు సీజన్ లో తక్షణమే విడుదల చేసి రైతుల బ్యాంకు ఎకౌంటు కు జమచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాతా భాస్కరరావు, వాసిరెడ్డి ప్రసాద్, దుగ్గి కృష్ణ, సహాయ కార్యదర్శులు చింత నిప్పు చలపతిరావు, రచ్చా నరసింహారావు,బిక్కసాని గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

# నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

- సత్తుపల్లి ఎస్సై టి.కిరణ్

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**



నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా, చట్టాలకు అనుగుణంగా నిర్వహించుకోవాలని సత్తుపల్లి ఎస్సై టి. కిరణ్ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "వేడుకల సందర్భంగా ఎవరైనా చట్టాలను ఉల్లంఘించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ నియమాలను అమలు చేస్తున్నాం. అందరూ సహకరించి వేడుకలను సురక్షితంగా జరుపుకోవాలి" అని పేర్కొన్నారు. ఎస్సై కిరణ్ నూతన సంవత్సర వేడుకలకు సంబంధించిన ప్రత్యేక చర్యలను వివరించారు. "డిసెంబర్ 31న రాత్రి 1:00 గంటలోపు వేడుకలు ముగించాలి. బహిరంగ ప్రదేశాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించరాదు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడతారు. తగిన చర్యలు తప్పవు. చట్టాలను ప్రతి ఒక్కరూ పాటించడం అత్యవసరం" అని హెచ్చరించారు. అనుమతుల మేరకే వేడుకలను నిర్వహించుకోవాలని, ఫైర్‌క్రాకర్స్, అధిక శబ్దంతో పాటలు ఉపయోగించవద్దని ఆయన తెలిపారు. "మీ చుట్టూ ఏదైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే 100 నంబర్‌కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందండి" అని ఎస్సై సూచించారు.వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవడంలో ప్రతి ఒక్కరి సహకారం అత్యవసరమని, చట్టాలపరమైన చర్యల గురించి ముందుగా జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలిపారు.



# ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక విజ్ఞప్తి

**వరంగల్ తెలంగాణ ముచ్చట్లు:**

వరంగల్ లోని తెలంగాణ రైతు భవన్ కార్యలయంలో సోమ రామూర్తి అధ్యక్షత న జరిగిన ఈ సమా వేశంలో గోధుమల కుమారస్వామిరాష్ట్ర చైర్మన్,గద్దం సదానం దం సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు,శాంతిసంఘం జిల్లా నాయకు లు డాక్టర్ అనిక్ సిద్ధిక్ , తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు,సోమిడి శ్రీనివాస్ మహిళా ప్రాతినిదులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి 80 మంది ప్రతి నిదులు పాల్గొన్నారు. వరంగల్ తూర్పు,వరంగల్ పడమర,వర్ధన్నపేట,పరకాల నియేజక వర్గాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవ టం జరిగింది.ఈ సందర్భంగా వక్త లు మాట్లాడుతూ తెగబడి కొట్లాడి తెలం గాణను సాదించు కున్నాక కెసిఆర్ ముఖ్య మంత్రి ఆద్వ ర్యంలో కళాకారుల పేరుతో కేవలం 3,4 వందల మందికె కొలువులు ఇచ్చారే తప్పా మెజారిటీ పోరాట యోదులను మరిచి పోయారని ఆవేదన వ్యక్తం తీవ్ర నిర్లక్ష్యం చేశారని, ఉద్యమంలో పాల్గొనని వారిని అధికారంలోకి తీసుకొని అందలాలు ఎక్కించిరని విమర్శించారు.స్వాతంత్ర్య పోరాట సమరయేదులను గుర్తించి గౌరవించి సమరయోధుల పెన్షన్ ను ఇచ్చారు.అంతేగాక గతంలో ఇదే గడ్డమీద జరిగిన తెలం గాణ ప్రజల సాయుధ పోరాట యోధులను గుర్తించటం కూడా జరి గింది. కానీ 1969లో మొదలై మొన్నటి వరకూ సాగిన ప్రత్యేక తెలంగాణరాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొని త్యాగాలు చేసిన పోరాట యోదు లను నేటికి గుర్తించక పోవడం విచారకరం అన్నారు. టి ఆర్ ఎస్ ప్రభుత్వం అనుసరించిన విదానా లను ఈసడించుకున్న ప్రజలు టిఆర్ ఎస్ (కెసిఆర్)ను గద్దేదించి ఎన్నికల సమయంలో కాంగ్రెసు రేవంత్ రెడ్డి చేసిన వాగ్దానాలను విశ్వసించి గెలిపించు కున్నారని తెలిపారు. ఉద్యమంలో పాల్గొన్న వారిని గుర్తించేందుకు ఒక కమిటీని నియ మించి తద్వారా ఉద్య మకారులను గుర్తించా లి,గౌరవ ప్రధంగా గుర్తిం పు కార్డుల మంజూరు చేయాలి.స్వంత ఇండ్లు లేని ఉద్యమకారులకు 250గజాల ఇంటి స్థలా న్ని ఇచ్చి పక్కా గృహాలనునిర్మించాలని డిమాండ్ చేశారు.

**ఉద్యమకారులను గుర్తించడంలోనే తెలంగాణ అభివృద్ధి ఇమిడి ఉందన్నారు.**

తెలంగాణకు తల మాణికంలాగా ఉండిన వరంల్ లోని ఆజాంజా హి మిల్లు తొలిగించ బడటం పెద్ద నష్టం అన్నారు. నష్టపోయిన కార్మికుల కు మిల్లు భూముల్లోనే కొంత బగాన్ని ఇంటి స్దలాలకు కేటాయించాలని కోర్టు ఉత్తర్వులు న్నాయని టిఆర్ఎస్ ప్రభుత్వం ముఖ్య మంత్రి కేసిఆర్ దానిని అమలు చేయలేదని చేయాలని ఎన్నికలకు ముందు చెప్పిన రేవంత్ రెడ్డి గారు నేడు ముఖ్య మంత్రి గా ఉన్నారు కాబట్టి వెంటనే వారు ఆజాంజాహీ కార్మికుల కు న్యాయం చేయాలని, అలాగే మిల్లు భూముల ను జ్యుడిసియల్ ఎంక్వరీ జరిపించి భూకబ్జా దారుల నుండి రక్షించి ప్రభుత్వ ప్రయోజనాలకు ఉప యోగించాలని, నిజంగా నష్టపోయిన ఉద్యమ కారులకు గుర్తింపు కార్డులతో పాటు తెలంగాణ ఉద్యమం లొ నష్ట పోయిన కళాకారులకు ఉద్యోగ అవకాశలను కల్పించాలని ఉద్యమ కారుల కోసం ప్రత్యేక బడ్జెట్ ను కేటాయించాలని వేధికమీది నుండి డిమాండ్ చేసారు.





# ఘనంగా విజయ గణపతి దుర్గామాత ఆలయ వార్షికోత్సవం

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**

గంగారం గ్రామంలోని విజయ గణపతి దుర్గామాత ఆలయం 6వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని పూజించారు. రాష్ట్ర కాంగ్రెస్ నేత డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఈ వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు సమాజంలో మానవీయ విలువలను పెంపొందించేందుకు దోహదపడతాయి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దాసరి వెంకటరామి రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వారంతా సంయుక్తంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.





# భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి యుండాలి

- డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చుంచు రాజేందర్.
- ప్రభుత్వ పథకాలను దళతులు సద్వినియోగం చేసుకొండి.
- తహసిల్దార్ ప్రసాద్.

**హసన్‌పర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

మనిషిని మనిషిగా చూడ నిరాకరించిన ఈ కుల వ్యవస్థలో రాజ్యాంగం దళితులను,గిరిజనులను ఇతర కులాలతో సమానంగా జీవింపజేసిందని, ప్రతి నెల నిర్వహించే పౌర హక్కుల దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించి, కులాల మధ్య అసమానతలను తొలగించే విధంగా కులాలకతీంగా భారత రాజ్యాంగం పట్ల అవగాహన పెంపోందించుకోవాలని, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తు దారుడికి ఇందిరమ్మ ఇండ్లను ఎటువంటి ఆంక్షలు లేకుండా మంజూరి చేయాలని డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చుంచు రాజేందర్ కోరారు.

సోమవారం నాడు మడిపల్లి గ్రామంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ (RI) ఫజీల్ ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ దళితులు తమ సమస్యలను మా దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కారానికి మార్గం చూపుతామన్నారు. గ్రామంలో బాల కార్మికులు,వెట్టి చాకిరి ఉందాని,దళిత వాడలలో కరెంటు, మంచినీటి,డ్రైనేజి సమస్య ఉన్నదా అని అదే విధంగా జోగిని, భానమతి గురించి సమావేశంలో అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలనలో ప్రభుత్వ పథకాల కొసం దరఖాస్తు చేసుకున్న అర్హ్వాలందరికి పథకాలను అందిస్తామని అన్నారు. దళిత వాడలో మంచి నీటి సమస్య, ప్రమాదకర ఇనుప కరెంట్ పోల్ సమస్యపై కరెంట్ అధికారులతో మరియు మండల యంపివో గారికి ఫోన్ లో సమస్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో భూమి సమస్యలు సాదాబైనామా సమస్యలు మా దృష్టికి తీసుకువచ్చిన వాటిని క్షేత్ర స్థాయిలో పరిక్షించి పరిష్కార మార్గం చూపుతామన్నారు. దళితులను ఇతర కులాల వారు సమానంగా చూడాలని కులవివక్షత చూపుతే చట్ట రీత్యా నేరమన్నారు.

**మనషులందరూ సమానమేనని ఆ దిశగా అందరూ అడుగులు వేయాలన్నారు.**

ఈ కార్యక్రమంలో ఆర్ ఐ ఫజిల్ , గ్రామ మాజీ సర్పంచులు కాందారి బాగ్యలక్ష్మి కృష్ణ మూర్తి, చిర్ర సుమలత విజయ్ కుమార్, దళిత వాధి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సందెల రవిందర్, డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, ఉప సర్పంచ్ బుర్ర రంజీత్,వార్డ్ సభ్యులు చిట్యాల బాలరాజు,బాల చందర్,రాజు,కిరణ్, పరుశరాములు,రెవెన్యూ సిబ్బంది మరియు గ్రామ పంచాయితి సిబ్బంది,ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మంగళవారం 31–12–2024

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# కొత్త సంవత్సరంలో ఆ రాశుల వారికి దశ తిరిగినట్టే

## 12 రాశుల వారికి సంవత్సర ఫలాలు



2025 సంవత్సర ఫలాలు (జనవరి 1 నుంచి డిసెంబర్ 31, 2025 వరకు): మేష రాశి వారికి కొత్త ఏడాది చాలావరకు అనుకూలంగానే సాగిపోతుంది. ఆదాయ వృద్ధికి బాగా అవకాశం ఉంటుంది. కొద్దిగా ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. వృషభ రాశి వారికి జీవితం ఏడాదంతా నల్లేరు మీద బండిలా సాగిపోతుంది. ద్వితీయార్థంలో పట్టిందల్లా బంగారం అవుతుంది. అనేక విధాలుగా ఆదాయం వృద్ధి చెందుతుంది. మిథున రాశి వారికి కొత్త సంవత్సరంలో ద్వితీయార్థం నుంచి జీవితం సాఫీగా, హ్యాపీగా సాగిపోయే అవకాశం ఉంది. మేష రాశి మొదలు మీన రాశి వరకు 12 రాశుల వారికి సంవత్సర ఫలాలు ఎలా ఉన్నాయంటే..

### మేషం

మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1): ఈ రాశికి కొత్త ఏడాది చాలావరకు అనుకూలంగానే సాగిపోతుంది. కొత్త సంవత్సరం మొదటి ఆరు నెలల్లో గురు, శనులు, మిగిలిన ఆరు నెలలు రాహువు, కుజుడు ఈ రాశివారి జీవితాన్ని విజయ పథంలో తీసుకువెడతారు. మార్చి 29 నుంచి ఈ రాశివారికి ఏలిన్నాటి శని ప్రారంభమవుతుంది. శనికి తరచూ దీపం వెలిగించడం, శివార్చన చేయించడం వల్ల శని దోషాలు చాలావరకు తగ్గి ఉంటాయి. లాభ స్థానంలో శని లేని లోటును మే 18 నుంచి ఏడాదిన్నర పాటు రాహువు తీర్చే అవకాశం ఉంది. ఆదాయ వృద్ధికి బాగా అవకాశం ఉంటుంది. కొద్దిగా ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. వృత్తి, వ్యాపారాల్లో ఆశించిన స్థాయిలో రాబడి పెరుగుతుంది. ఉద్యోగ జీవితం కొద్దిగా పని భారం, అదనపు బాధ్యతలు పెరిగినప్పటికీ సానుకూలతలకు లోటుండదు. ఏడాది ద్వితీ యార్థంలో ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యమైన వ్యవహారాలు, పనులు విజయ వంతంగా పూర్తవుతాయి. ఏ ప్రయత్నం తలపెట్టినా కొద్ది వ్యయ ప్రయాసలతో సఫలం అవుతుంది. సంవత్సరం మొత్తం మీద ఒకటి రెండు సార్లు ధన యోగం పట్టే సూచనలున్నాయి. నిరుద్యోగులకు విదేశీ అవకాశాలు లభిస్తాయి. తల్లితండ్రుల నుంచి అనేక విధాలుగా సహాయ సహకారాలు అందుతాయి. ఆస్తి వివాదం ఒకటి పెద్దల జోక్యంతో పరిష్కారం అవుతుంది. కుటుంబంలో శుభ పరిణామాలు చోటు చేసుకుంటాయి. ఉద్యోగ, పెళ్లి ప్రయత్నాలు సఫలం అవుతాయి. విద్యార్థులు కొద్ది శ్రమతో ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. ప్రేమ వ్యవహారాలు హ్యాపీగా, సాఫీగా సాగిపోతాయి.

### వృషభం

వృషభం (కృత్తిక 2,3,4, రోహిణి, మృగశిర 1,2): లాభస్థానంలో శని, దన స్థానంలో గురువు ప్రవేశం వల్ల వీరి జీవితం ఏడాదంతా నల్లేరు మీద బండిలా సాగిపోతుంది. ద్వితీయార్థంలో పట్టిందల్లా బంగారం అవుతుంది. అనేక విధాలుగా ఆదాయం వృద్ధి చెందుతుంది. వ్యక్తిగత జీవితంలోనూ, కుటుంబ జీవితంలోనూ అనేక శుభ పరిణామాలు చోటు చేసుకుంటాయి. సాధారణ వ్యక్తి సైతం సంపన్నుడయ్యే అవకాశం ఉంది. కుటుంబ జీవితం హ్యాపీగా సాఫీగా సాగిపోతుంది. ఇంట్లో శుభ కార్యాలు చోటు చేసుకుంటాయి. ఆర్థిక వ్యవహారాలు విజయవంతంగా, సంతృప్తికరంగా సాగిపోతాయి. ఆరోగ్యం బాగా మెరుగ్గా ఉంటుంది. ఒకటి రెండు ప్రధానమైన వ్యక్తిగత సమస్యలు పరిష్కారమవుతాయి. అదికారుల అనుగ్రహానికి పాత్రులవుతారు. రాశినాథుడు శుక్రుడు ఏడాదంతా బాగా అనుకూలంగా ఉన్నందువల్ల ఆర్థిక పరిస్థితి బాగా మెరుగుపడుతుంది. ఏ ప్రయత్నం తలపెట్టినా విజయవంతం అవుతుంది. ప్రము ఖులతో పరిచయాలు వృద్ధి చెందుతాయి. అదనపు ఆదాయ ప్రయత్నాలు సానుకూలపడతాయి. పలుకుబడి పెరుగుతుంది. విద్యార్థులు సునాయాసంగా విజయాలు సాధిస్తారు. సంపన్న కుటుంబంతో పెళ్లి సంబంధం ఖాయం అయ్యే అవకాశం ఉంది. ప్రేమ వ్యవహారాలు హ్యాపీగా సాగి పోతాయి. ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. ఇతరుల వివాదాల్లో కల్పించుకోకపో వడం మంచిది. ప్రతి ఆదివారం ఉదయం ఆదిత్య హృదయం పఠించడం వల్ల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. తీర్థయాత్రలు, విహార యాత్రలతో పాటు విదేశీ యానానికి కూడా అవకాశం ఉంది.

### మిథునం

మిథునం (మృగశిర 3,4, ఆర్ద్ర, పునర్వసు 1,2,3): ఈ రాశికి శని, గురువు, రాహువు వంటి ప్రధాన గ్రహాల అనుకూలత తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, రాశ్యధిపతి బుధుడు, శుక్రుడు, రవి గ్రహాల అనుకూలత బాగా పెరుగుతున్నందువల్ల కొత్త సంవత్సరంలో ద్వితీయార్థం నుంచి జీవితం సాఫీగా, హ్యాపీగా సాగిపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం వ్యయ స్థానంలో సంచారం చేస్తున్న గురువు మే 25 నుంచి మిథున రాశిలోకి ప్రవేశిస్తున్నందువల్ల ద్వితీయార్థంలో ధన వృద్ధికి, పదోన్నతులకు, ఇంట్లో శుభకార్యాలకు బాగా అవకాశం ఉంది. మే 25 లోపు వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో కొద్దిగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఆస్తి వివాదాలు, కోర్టు వివాదాలు మే 18 తర్వాత నుంచి పరిష్కారం కావడం ప్రారంభిస్తాయి. మే 18 నుంచి రాహువు భాగ్య స్థానంలోకి, మార్చి 29 నుంచి శని దశమ స్థానంలోకి అడుగు పెడుతున్నందువల్ల విదేశాల్లో ఉద్యోగం లభించే అవకాశం ఉంది. అయితే, పని భారం విపరీతంగా పెరిగి విశ్రాంతి కరవయ్యే అవకాశం ఉంది. తరచూ శివాలయానికి వెళ్లి అర్చన చేయించడం మంచిది. ఆర్థికంగా అంచనాలకు మించిన పురోగతి ఉంటుంది. ఒకటి రెండు ముఖ్యమైన వ్యక్తిగత సమస్యలు పరిష్కారం అవుతాయి. నిరుద్యోగులకు ప్రథమార్థంలో సామాన్యమైన ఉద్యోగం లభించినా, ద్వితీయార్థంలో మాత్రం ఆశించిన ఉద్యోగం లభిస్తుంది. పెళ్లి ప్రయత్నాల్లో శుభ సమాచారం అందుతుంది. కుటుంబ జీవితం సుఖ సంతోషాలతో సాగిపోతుంది. విద్యార్థులు తేలికగా విజయాలు సాధిస్తారు. ప్రేమ వ్యవహారాలు హ్యాపీగా, సాఫీగా సాగిపోతాయి.

### కర్కాటకం

కర్కాటకం (పునర్వసు 4, పుష్యమి, ఆశ్లేష): ఈ రాశికి శని మార్చి 29న మీన రాశిలోకి ప్రవేశించడంతో అష్టమ శని దోషం నుంచి విముక్తి లభిస్తుంది. మే 18న రాహువు అష్టమ స్థానంలోకి ప్రవేశిస్తున్నందువల్ల ఆరోగ్యం మీదా, ఆహార, విహారాల మీదా శ్రద్ధ పెట్టడం మంచిది. మే 25న గురువు వ్యయ స్థానంలోకి ప్రవేశిస్తున్నందువల్ల శుభకార్యాల మీద ఎక్కువగా ఖర్చు పెట్టడం జరుగుతుంది. ఉద్యోగాలపరంగా విదేశాలకు వెళ్లడం, అక్కడ స్థిరపడడం జరుగుతుంది. ఆదాయం బాగా వృద్ధి చెందుతుంది కానీ, కుటుంబ ఖర్చులు బాగా పెరుగుతాయి. సుందరకాండ పారాయణం, విష్ణు సహస్రనామ స్తోత్ర పఠనం వల్ల గురువు మరింత అనుకూలంగా మారి, ఆదాయాన్ని బాగా పెంచే అవకాశం ఉంటుంది. మొత్తం మీద ఏడా దంతా కాస్తంత సంతృప్తికరంగా, అనుకూలంగానే సాగిపోతుంది. ఒకటి రెండు వ్యక్తిగత సమ స్యల పరిష్కారంతో పాటు, ఆర్థిక సమస్యలు కూడా పూర్తిగా పరిష్కారమయ్యే అవకాశం ఉంది. వృత్తి, ఉద్యోగాల్లో ప్రాభవం పెరుగుతుంది. వ్యాపారాలు లాభాలపరంగా బలం పుంజుకుంటాయి. ఉద్యోగ స్థిరత్వం ఏర్పడుతుంది. శుభ గ్రహాల అనుకూల సంచారం వల్ల కుటుంబ జీవితం హ్యాపీగా సాగి పోయే అవకాశం ఉంది. వృత్తి, ఉద్యోగాలపరంగా బరువు బాధ్యతలు పెరగడం, ఒత్తిడి ఎక్కువ కావ డం వంటివి జరుగుతాయి. ఆరోగ్యం అనుకూలంగా ఉంటుంది. విద్యార్థులు కొద్దిపాటి శ్రమతో ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. మే తర్వాత నుంచి పెళ్లి సంబంధాలు కుదురుతాయి. ప్రేమ వ్యవ హారాలు సానుకూలంగా సాగిపోతాయి. నిరుద్యోగులకు విదేశాల నుంచి శుభవార్తలు అందుతాయి.

### సింహం

సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1): ఈ రాశికి ప్రథమార్థం కంటే ద్వితీయార్థం బాగా అనుకూలంగా ఉంది. మే 25న గురువు లాభ స్థానంలోకి మారిన దగ్గర నుంచి ఆదాయం పెరగడం, శుభ పరిణామాలు చోటు చేసుకోవడం, ఇంట్లో శుభకార్యాలు జరగడం, సంపన్నులు కావడం, ఆస్తి కలిసి రావడం వంటివి జరుగుతాయి. మార్చి 29న శని మీన రాశిలో ప్రవేశించడం వల్ల అష్టమ శని దోషం ప్రారంభం అవుతున్నప్పటికీ, లాభ స్థానంలోని గురువు వల్ల ఒక ఏడాది పాటు శని దోషం పనిచేసే అవకాశం ఉండకపోవచ్చు. ఉద్యోగంలో పని భారం, వృత్తి, ఉద్యోగాల్లో కొద్దిగా శ్రమాధిక్యత ఉండవచ్చు. ఈ రాశివారికి ఈ ఏడాదంతా కొద్దిగా అనుకూలంగానే సాగిపోతుంది. ప్రథమార్థంలో స్వల్ప అనారోగ్యాలకు అవకాశం ఉంది. వ్యాపారాలు నిలకడగా సాగిపోతాయి. ప్రథమార్థంలో ఆర్థిక పరిస్థితి మధ్య మధ్య ఇబ్బంది పెడుతుంది. కొత్త ఉద్యోగ ప్రయత్నాలు సానుకూలపడతాయి. కొద్దిగా ఆదాయ వృద్ధి ఉంటుంది కానీ, అందుకు తగ్గట్టుగా వృథా ఖర్చులు కూడా ఉంటాయి. పెళ్లి ప్రయత్నాలు సఫలం అవుతాయి. కుటుంబ సభ్యుల నుంచి శుభవార్తలు వింటారు. జీవిత భాగస్వామికి సంబంధించి ఒకటి రెండు శుభ పరిణామాలు చోటు చేసుకుంటాయి. శనీశ్వరుడికి జపం, తైలాభిషేకం, శివార్చన చేయించడం వల్ల అనేక కష్టనష్టాల నుంచి బయటపడడం జరుగుతుంది. ఒకటి రెండు సార్లు ధన యోగం పడుతుంది. విద్యార్థులు బాగా కష్టపడాల్సి ఉంటుంది. పెళ్లి సంబంధా లకు గట్టి ప్రయ త్నాలు సాగిం చాల్సి ఉంటుంది. ప్రేమ వ్యవహారాలు సంతృప్తికరంగా సాగుతాయి.



### కన్య

కన్య (ఉత్తర 2,3,4, హస్త, చిత్త 1,2): మార్చి 29న శని సప్తమ స్థానమైన మీన రాశిలో ప్రవేశించడం వల్ల ద్వితీయార్థంలో వృత్తి, ఉద్యోగాల్లో అనుకూలతలు కొద్దిగా తగ్గే అవకాశం ఉంది. పని భారం, వేధింపులు, సమస్యలు పీడించే సూచనలున్నాయి. అయితే, మే 18 నుంచి ఆరవ స్థానంలో రాహువు ప్రవేశం వల్ల ఉద్యోగం మారడానికి అవకాశం ఉంది. ద్వితీయార్థంలో ఉద్యోగ పరిస్థితుల కొద్దిగా సానుకూలపడే అవకాశం ఉంది. దశమంలో గురువు ప్రవేశం వల్ల ఉద్యోగ మారడానికి అవకాశం ఉంది. వ్యక్తిగత, కుటుంబ సమస్యలు బాగా తగ్గుముఖం పడతాయి. మానసిక ప్రశాంతతకు లోటుండదు. అనుకున్న పనులు నిదానంగా పూర్తవుతాయి. సంపన్న కుటుంబానికి చెందిన వ్యక్తితో పెళ్లి సంబంధం కుదరుతుంది. ఆధ్యాత్మిక చింతన బాగా పెరుగుతుంది. ఆదాయ ప్రయత్నాలు సఫలం అవుతాయి కానీ అందుకు తగ్గట్టుగా అనవసర ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారాల్లో లాభాలు ఆశాజనకంగా ఉంటాయి. మే వరకు ఆర్థికంగా, కుటుంబపరంగా పురోగతి ఉంటుంది. మాటకు, చేతకు విలువ పెరుగుతుంది. ఆ తర్వాత వ్యాపార భాగస్వాములతో, జీవిత భాగస్వామితో ఇబ్బం దులు ఏర్పడవచ్చు. ఆచితూచి వ్యవహరించడం అన్నివిధాలా మంచిది. ఆర్థిక వ్యవహారాలు సానుకూలంగా సాగిపోతాయి. ఆస్తి వివాదాలు అనుకూలంగా పరిష్కారమవుతాయి. ఆరోగ్యానికి లోటుండదు. విద్యార్థులు తేలికగా విజయాలు సాధిస్తారు. ప్రేమ వ్యవహారాలు హ్యాపీగా, సాఫీగా సాగిపోతాయి. శని, రాహువులకు పరిహారంగా తరచూ శివార్చన చేయించడం మంచిది.

### తుల

తుల (చిత్త 3,4, స్వాతి, విశాఖ 1,2,3): ఈ రాశివారికి కొత్త సంవత్సరమంతా వైభవంగా సాగిపోతుంది. మార్చి 29 నుంచి శని మీన రాశి సంచారం ప్రారంభిస్తున్నందువల్ల పట్టిందల్లా బంగారం అవుతుంది. ప్రతి పని, ప్రతి ప్రయత్నం విజయం సాధిస్తాయి. అనేక మార్గాల్లో ఆదాయం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతుంది. శత్రు, రోగ, రుణ బాధల నుంచి పూర్తిగా విముక్తి లభిస్తుంది. మే 18న కుంభ రాశిలోకి మారబోయే రాహువు, మే 25న మిథున రాశిలోకి మారబోయే గురువు అనేక శుభ యోగాలనివ్వడం జరుగుతుంది. మిథున రాశిలో గురువు ప్రవేశంతో ఈ రాశి వారికి ఏడాదంతా శుభ పరిణామాలతో, శుభ వార్తలతో, శుభకార్యాలతో సాగిపోతుంది. ఉద్యోగంలో ఉన్నత పదవులను పొందడం జరుగుతుంది. వృత్తి, వ్యాపారాలు లాభదాయకంగా సాగిపోతాయి. ఉద్యోగులకు, నిరుద్యోగులకు విదేశాల్లో ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. పెళ్లి ప్రయత్నాల్లో కూడా విదేశీ సంబంధాలు కుదురుతాయి. రాజకీయంగా, సామాజికంగా ఉన్నత స్థానాలలో ఉన్న వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. లాభ స్థానంలో కేతువు ప్రవేశిస్తున్నందువల్ల అనవసర పరిచయాలు కలిగే అవకాశం ఉంది. కొందరు స్నేహితుల వల్ల ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది. తీర్థ యాత్రలు, విహార యాత్రలు ఎక్కువగా చేసే అవకాశం ఉంది. వీలైనప్పుడల్లా సుబ్రహ్మణ్యాష్టకం చదువు కోవడం వల్ల రాహు కేతువులు మరింత అనుకూలంగా మారే అవకాశం ఉంటుంది. విద్యార్థులు మంచి విజయాలు సాధిస్తారు. ప్రేమ వ్యవహారాలు ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగిపోతాయి.

### వృశ్చికం

వృశ్చికం (విశాఖ 4, అనూరాధ, జ్యేష్ట): ఈ రాశివారికి శని, రాహు, గురువులు అనుకూలంగా లేనందువల్ల ఈ సంవత్సరం ద్వితీయా ర్థంలో అనుకున్న పనులు అనుకున్నట్టు జరిగే అవకాశం లేదు. ఆర్థిక ఇబ్బందులు, రావలసిన సొమ్ము రాకపోవడం, ముఖ్యమైన వ్యవహారాల్లో తప్పటడుగులు, ఉద్యోగాల్లో పొరపాట్లు వంటివి జరిగే అవకాశం ఉంది. ప్రథమార్థం సాఫీగా సాగిపోయే అవకాశం ఉంది కానీ, ద్వితీయార్థంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. సుబ్రహ్మణ్యాష్టకం పఠించడంతో పాటు, తరచూ శివార్చన చేయించడం వల్ల రాశ్యధిపతి కుజుడు, శని అనుకూలంగా మారే అవకాశం ఉంటుంది. రాశ్యధిపతి కుజుడి కారణంగా కొద్ది ప్రయత్నంతో, కొద్ది శ్రమతో సంవత్సరమంతా ఆర్థికంగా, ఉద్యోగపరంగా శుభప్రదంగా సాగిపోతుంది. ఆరోగ్యం మీద కొద్దిగా శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. ఆర్థిక వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించాల్సి ఉంటుంది. మే వరకు వృత్తి, ఉద్యోగాల పరంగా హోదా పెరగడంతో పాటు, సామాజికంగా పేరు ప్రతిష్ఠలు పెంచే అవకాశం ఉంది. గురు, కేతువులు అనుకూలంగా ఉండడం వల్ల తప్పకుండా కొన్ని శుభ పరిణామాలు అనుభవానికి వస్తాయి. కుటుంబ జీవితం సుఖమయంగా సాగిపోతుంది. వ్యాపారాలు నిలకడగా ముందుకు సాగుతాయి. సొంత పనుల మీద శ్రద్ధ పెట్టడం మంచిది. వృత్తి, వ్యాపారాల్లో సొంత ఆలోచనలు కలిసి వస్తాయి. విద్యా ర్థులు స్వల్ప ప్రయత్నంతో ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. పెళ్లి సంబంధం కుదురుతుంది. ప్రేమ వ్యవహారాలు హ్యాపీగా సాగిపోతాయి. నిరుద్యోగులకు మే లోపు ఉద్యోగ యోగం పడుతుంది.

### ధనుస్సు

ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1): ఈ రాశివారికి ఏడాదంతా అనుకూలంగా సాగిపోయే అవకాశం ఉంది. మార్చి ఆఖరులో శని మీన రాశి ప్రవేశం వల్ల ఈ రాశివారికి అర్ధాష్టమ శని ప్రారంభం అవుతుంది. అయితే, మే 18న రాహువు తృతీయ స్థానంలో ప్రవేశించడం, మే 25 నుంచి గురువు సప్తమ స్థానంలో ప్రవేశించడం వల్ల అర్ధాష్టమ శని దోషం బాగా తగ్గి ఉంటుంది. ఆదాయం బాగా వృద్ధి చెందుతుంది. ఉద్యోగంలో పదోన్నతులు కలుగుతాయి. వృత్తి, వ్యాపారాలు రాబడిపరంగా ఆశించిన పురోగతి సాధిస్తాయి. ఇంట్లో శుభకార్యాలు జరుగుతాయి. ఉన్నత స్థాయి కుటుంబానికి చెందిన వ్యక్తితో పెళ్లి సంబంధం కుదురుతుంది. ఏ ప్రయత్నం తలపెట్టినా సఫలం అవుతుంది. ప్రథమార్థం కంటే ద్వితీయార్థం వైభవంగా సాగిపోతుంది. ఒక ప్రముఖుడుగా గుర్తింపు పొందే అవకాశం ఉంది. కుటుంబంలో సుఖ సంతోషాలు వృద్ధి చెందుతాయి. నిరుద్యోగులకు విదేశాల నుంచి ఆశించిన సమాచారం అందు తుంది. విదేశాలకు సంబంధించిన సంస్థల్లోకి ఉద్యోగం మారడానికి అవకాశం ఉంటుంది. ఉద్యో గంలో ప్రాధాన్యం, ప్రాభవం పెరుగుతాయి. అనారోగ్యం నుంచి కోలుకోవడం జరుగుతుంది. వ్యక్తిగత సమస్యలు తగ్గుముఖం పడతాయి. ఆర్థిక ప్రయత్నాలు, ఆర్థిక లావాదేవీలు ఆశించిన ఫలితాలనిస్తాయి. పిల్లల నుంచి శుభవార్తలు వింటారు. రాదనుకున్న డబ్బు చేతికి అందుతుంది. విద్యార్థులు సునాయాసంగా విజయాలు సాధిస్తారు. ప్రేమ వ్యవహారాలు పెళ్లిళ్లకు దారితీస్తాయి. క్రమబద్ధంగా లలితా సహస్ర నామ స్తోత్రం పఠించడం వల్ల మనసులోని కోరికలు నెరవేరుతాయి.

### మకరం

మకరం (ఉత్తరాషాఢ 2,3,4, శ్రవణం, ధనిష్ట 1,2): మార్చి 29న శని తృతీయ రాశిలోకి మారుతున్నందువల్ల ఏలిన్నాటి శని దోషం నుంచి పూర్తిగా బయటపడడం జరుగుతుంది. దీనివల్ల అనేక కష్టనష్టాలు, పని ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, అనా రోగ్యాల నుంచి విముక్తి లభిస్తుంది. జీవితం పురోగతి బాటపడుతుంది. ఉద్యోగంలోనే కాక, సామా జికంగా కూడా ఆశించిన గుర్తింపు లభిస్తుంది. మే 18న కుంభ రాశిలో ప్రవేశిస్తున్న రాహువు వల్లే కాకుండా, మే 25న మిథున రాశిలోకి ప్రవేశిస్తున్న గురువు వల్ల కూడా ఈ రాశివారికి శత్రు, రోగ, రుణ సమస్యల నుంచి చాలావరకు ఉపశమనం కలుగుతుంది. రావలసిన డబ్బు చేతికి అందుతుంది. ఉద్యోగంలో పదోన్నతులకు, వృత్తి, వ్యాపారాల్లో డిమాండ్ పెరగడానికి కూడా అవ కాశం ఉంది. ద్వితీయార్థంలో వీరికి అనుకూలతలు బాగా పెరుగుతాయి. జీవితం కొత్త పుంతలు తొక్కుతుంది. ఆదాయం క్రమంగా పెరగడం ప్రారంభం అవుతుంది. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలు ఊపందుకుంటాయి. స్వల్ప అనారోగ్యాలకు అవకాశం ఉంది. ఇంటా బయటా అనుకూలతలు పెరుగుతాయి. ఒకటి రెండు శుభవార్తలు వినే అవకాశం ఉంది. నిరుద్యోగులు విదేశీ ఉద్యోగాలు సంపాదించే అవకాశం ఉంది. విదేశాల్లో స్థిరపడడం కూడా జరుగుతుంది. ఆర్థిక లావా దేవీలు బాగా కలిసి వస్తాయి. కుటుంబ జీవితం సాఫీగా, హ్యాపీగా సాగిపోతుంది. విద్యార్థులు కొద్ది శ్రమతో ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. ఆశించిన పెళ్లి సంబంధం కుదురుతుంది. ప్రేమ వ్యవ హారాల్లో సాన్నిహిత్యం పెరుగుతుంది. విష్ణు సహస్రనామ స్తోత్ర పఠనం వల్ల అనేక శుభాలు జరుగుతాయి.

### కుంభం

కుంభం (ధనిష్ట 3,4, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3): ఏప్రిల్ నెల నుంచి వీరి జీవితంలో సానుకూల మార్పులు చోటు చేసుకోవడం ప్రారంభిస్తాయి. శని మీన రాశిలోకి మారినప్పటి నుంచి కొన్ని సమస్యలు, ఇబ్బందులు, ఒత్తిళ్ల నుంచి విముక్తి కలుగుతుంది. ఈ రాశిలోకి రాహువు ప్రవేశించడం వల్ల ఉన్నత స్థానానికి ఎదిగే అవకాశం ఉంది. మే చివరలో గురువు పంచమ స్థానంలో ప్రవేశించిన తర్వాత నుంచి వీరి జీవితం కొత్త పుంతలు తొక్కుతుంది. ఆదాయం వృద్ధి చెందడం, ప్రతిభకు, సమర్థతకు గుర్తింపు లభించడం, పిల్లలు ఘన విజయాలు సాధించడం, వ్యక్తిగత సమస్యలు పరిష్కారం కావడం, సంతాన యోగం కలగడం వంటివి జరుగుతాయి. ప్రథమార్థం కంటే ద్వితీయార్థం వైభవంగా సాగిపోతుంది. ద్వితీయార్థంలో వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో ఆదాయం బాగా పెరుగుతుంది. ఆశించిన స్థాయిలో ఆర్థికాభివృద్ధి కనిపిస్తుంది. అనవసర ఖర్చుల విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిది. వృత్తి, ఉద్యోగాల్లో గౌరవ మర్యాదలకు లోటుండదు. విదేశీ ఉద్యోగాలకు లేదా చదువులకు అవకాశం ఉంటుంది. నిరుద్యోగులు దూర ప్రాంతాల నుంచి శుభ సమాచారం అందుకుంటారు. పిల్లలు చదువుల్లో పురోగతి సాధిస్తారు. వ్యక్తిగత, కుటుంబ సమస్యల నుంచి చాలావరకు విముక్తి లభిస్తుంది. ఆహార, విహారాల్లో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. విద్యార్థులు మే నెల నుంచి తమ చదువులపై శ్రద్ధ పెంచాల్సి ఉంటుంది. ప్రేమ వ్యవహారాల్లో ఆచితూచి అడుగు వేయడం మంచిది. పెళ్లి ప్రయత్నాలు, ఉద్యోగ ప్రయత్నాలు తప్పకుండా సఫలం అవుతాయి.

### మీనం

మీనం (పూర్వాభాద్ర 4, ఉత్తరాభాద్ర, రేవతి): ఈ ఏడాది ఈ రాశివారికి ప్రథమార్థమంతా అనుకూలంగా సాగిపోతుంది. ద్వితీయార్థంలో వీరికి అనుకూలతలు బాగా తగ్గే అవకాశం ఉంది. మార్చి చివరలో శని, మే చివరలో రాహువు, గురువు మారుతున్నందువల్ల వీరికి ఆరోగ్యపరంగా, ఆదాయపరంగా కొన్ని చిక్కు సమస్యలు, ఇబ్బం దులు తప్పకపోవచ్చు. తరచూ శివార్చన చేయించడం వల్ల శని దోషం తగ్గే అవకాశం ఉంది. మీన రాశిలోకి శని ప్రవేశించిన దగ్గర నుంచి వ్యక్తిగత, ఆర్థిక సమస్యలు పెరిగే అవకాశం ఉంది. రాహువు వ్యయ స్థానంలోకి వచ్చిన తర్వాత ఆర్థికంగా మోసపోవడం, నష్టాలు కలగడం, ఆర్థిక వ్యవహారాలు సానుకూలంగా సాగకపోవడం, ఆస్తి వివాదాలు పరిష్కారం కాకపోవడం వంటివి జరిగే అవకాశం ఉంది. గృహ, వాహన ప్రయత్నాల్లో కూడా ఇబ్బందులుంటాయి. మే నెల వరకు ఈ రాశివారు వృత్తి, ఉద్యోగాల పరంగానే కాకుండా ఆర్థికంగా కూడా కొద్దిగా శుభ ఫలితాలను అనుభవించడం జరుగుతుంది. వ్యక్తిగత సమస్యలు తగ్గుముఖం పడతాయి. మనసులోని కోరి కలు నెరవేరుతాయి. ద్వితీయార్థంలో జీవిత భాగస్వామితో విభేదించడం, జీవిత భాగస్వామి స్వల్ప అనారోగ్యాలు గురి కావడం జరగవచ్చు. ఆదాయం తగ్గడం, ఆర్థిక సమస్యలు పెరగడం వంటివి జరుగుతాయి. వృత్తి, ఉద్యోగాల్లో ప్రాధాన్యం తగ్గే అవకాశం కూడా ఉంది. తీర్థయాత్రలు, విహార యాత్రలు బాగా విస్తృతమవుతాయి. విద్యార్థులకు శ్రమ తప్పకపోవచ్చు. ప్రేమ వ్యవహారాలు సాఫీగా సాగిపోతాయి. పెళ్లి ప్రయత్నాలు సఫలమవుతాయి. నిరుద్యోగులు శుభవార్తలు వింటారు

## రాశుల యొక్క గుర్తులు


మేషం


వృషభం


మిథునం


కర్కాటకం


సింహం



కన్య


తుల


వృశ్చికం


ధనుస్సు


మకరం


కుంభం


మీనం



# మోదీ ప్రశంసలు మాకెంతో ప్రత్యేకం

చిత్ర పరిశ్రమకు అక్కినేని నాగేశ్వరరావు చేసిన అమూల్యమైన సేవల్ని ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో కొనియాడిన సంగతి తెలిసిందే. తనదైన నటనా కౌశలంతో ఏఎన్నార్ తెలుగు సినిమాను కొత్త శిఖరాలకు తీసుకెళ్లారంటూ ఆయన ప్రశంసలు కురిపించారు. ఈ నేపథ్యంలో ఏఎన్నార్ సేవల్ని మోదీ గుర్తుచేసుకోవడం పట్ల అక్కినేని కుటుంబం సామాజిక మాధ్యమాల వేదికగా కృతజ్ఞతలు తెలిపింది. "మహమ్మద్ రఫీ, తపన్ సిన్హా, రాజ్‌కపూర్ లాంటి దిగ్గజాలతో పాటు మా నాన్న ఏఎన్నార్‌ను ఆయన శత జయంతి సందర్భంగా మీరు గౌరవించడం ఆనందంగా ఉంది. భారతీయ సినిమాకి ఆయన దార్శనికత.. వారందించిన సేవలు తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి" అంటూ మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ 'మన్ కీ బాత్' ఆడియో క్లిప్‌ను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు నాగార్జున. "ఏఎన్నార్ కళా నైపుణ్యాన్ని, తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఆయన చేసిన సేవల్ని మీరు అభినందించడం ఎంతో ఆనందంగా ఉంది. ఇది మాకెంతో ప్రత్యేకం. మీ అద్భుతమైన ప్రశంసలకు హృదయపూర్వక కృతజ్ఞతలు" అంటూ నాగచైతన్య, శోభిత దంపతులు పోస్ట్‌లు పెట్టారు.



# యానిమల్ బ్యూటీ చేసేవన్నీ ఆ పాత్రలే..!

తెలుగు దర్శకుడు సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో వచ్చిన 'యానిమల్' సినిమాతో తృప్తి డిమ్రి ఓవర్ నైట్ స్టార్ అయ్యింది. ఆ సినిమాలో రణబీర్ కపూర్‌తో చేసిన రొమాంటిక్ సీన్స్‌తో పాటు, నటనతోనూ మెప్పించింది. యానిమల్ సినిమా వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సొంతం చేసుకున్న నేపథ్యంలో హీరోయిన్‌గా నటించిన రష్మిక మందన్న కంటే తృప్తి డిమ్రికి ఎక్కువ ఫేం దక్కింది. బాలీవుడ్‌లో ఈ అమ్మడు ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ హీరోయిన్స్ జాబితాలో చేరింది. 2023లో యానిమల్ సినిమా వచ్చింది. ఆ ఏడాది చివర్లో వచ్చిన యానిమల్ తర్వాత వరుసగా సినిమా ఆఫర్లు త్రిప్తి తలుపు తట్టాయి అంటూ బాలీవుడ్ మీడియాలో కథనాలు వచ్చాయి.యానిమల్ వంటి బిగ్గెస్ట్ మూవీ తర్వాత చిన్నా చితకా సినిమాలు చేయకూడదు అనే ఉద్దేశ్యంతో వచ్చిన ప్రతి ఒక్క ఆఫర్‌ని ఓకే అని చెప్పకుండా ఆచితూచి ఎంపిక చేసుకుంటూ నటించింది. ఈ ఏడాది తృప్తి నుంచి మూడు సినిమాలు వచ్చాయి. బ్యాడ్ న్యూస్ కి మంచి స్పందన వచ్చింది. భూల్ భులయ్యా 3 బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ ఏడాదిలో మూడు సినిమాలతోనూ మంచి పేరును సొంతం చేసుకోవడంతో పాటు డీసెంట్ హిట్‌లను సొంతం చేసుకున్న తృప్తి వచ్చే ఏడాది మరిన్ని సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అయితే ఇక్కడ తృప్తి ని అభిమానించే వారు కొందరు ఆమె విషయంలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

2024లో ఆమె నటించిన మూడు సినిమాల్లోనూ అందాల ఆరబోతకి పరిమితం అయ్యింది. కొన్ని సీన్స్‌లో యాక్టింగ్‌తో మెప్పించినా మొత్తంగా ఆమెను గురించి మాట్లాడితే స్కిన్ షో గురించి మాట్లాడుతూ ఉన్నారు. అందుకే ముందు ముందు ఆమె చేస్తున్న సినిమాలు, చేయబోతున్న సినిమాల విషయంలో కాస్త జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. స్కిన్ షో వరకే చేస్తే తక్కువ కాలంకే ఆమె ఫేడ్ ఔట్ అయ్యే ప్రమాదం ఉంది. కనుక నటనకు ఆస్కారం ఉన్న పాత్రలను ఎంపిక చేసుకోవడం మాత్రమే కాకుండా సినిమా కథలో ప్రాముఖ్యత ఉన్న పాత్ర అయితేనే ఎంపిక చేసుకోవాలని అభిమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## sports స్పోర్ట్స్



# ఆ వికెట్ పడినప్పుడే.. మ్యాచ్ కష్టమని అర్థమైంది

ల్బోర్న్ వేదికగా ఆసీస్‌తో జరిగిన టెస్టులో భారత్ 184 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. మ్యాచ్ అనంతరం కెప్టెన్ రోహిత్ శర్మ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. ఈ ఓటమితో టెస్టు కెరీర్‌కు వీడ్కోలు చెబుతాడన్న కథనాలు వచ్చాయి. విలేకర్ల సమావేశంలోనే దీనిపై నిర్ణయం వెల్లడిస్తారని ఊహించారు. కానీ, అతడేమీ దీనిపై స్పందించలేదు. శుభ్‌మన్ గిల్‌ను పక్కనపెట్టడం.. బుమ్రా, నితీశ్ ప్రదర్శనతోపాటు మ్యాచ్ చేజారడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

"మెల్‌బోర్న్‌లో రెండో ఇన్నింగ్స్ ఆడటం అంత సులువేం కాదు. ఈ మ్యాచ్‌లో ఓడిపోవడం తీవ్రంగా నిరాశపరిచింది. రిషభ్ పంత్ కీలక సమయంలో ఔటయ్యాడు. అతడి వికెట్ పడిన తర్వాత మ్యాచ్ మరింత సంక్లిష్టంగా మారుతుందని అనిపించింది. అతడు ఆడిన తీరును తప్పుబట్టలేం. ఎన్నోసార్లు జట్టును గెలిపించాడు. అయితే, పరిస్థితికి తగ్గట్టుగా ఆడాలని కెప్టెన్‌గా కోరుకుంటా. రిస్క్ తీసుకోవాల్సిఉంటే.. అలాగే ఆడాలి. యశస్వి జైస్వాల్ ఔట్ విషయంలో ఏం జరిగిందో అర్థం కావడం లేదు. మామూలుగా చూస్తే బంతి తాకినట్లు అనిపించింది. కానీ టెక్నాలజీ కూడా వందశాతం ఫలితాలు ఇవ్వలేకపోతోంది. చివరికి ఔట్ ఇవ్వడం వల్ల భారత్‌కు నష్టమే జరిగింది. ఇక్కడా మాకు దురదృష్టం ఎదురైంది" అని రోహిత్ వెల్లడించాడు.బుమ్రాపై పనిభారం... వారు ఇంకాస్త మెరుగవ్వాలి

"జస్‌ప్రీత్ బుమ్రా విషయంలో మేం జాగ్రత్తగానే ఉన్నాం. ఎలా ఉందని రెగ్యులర్‌గా మాట్లాడుతూనే ఉంటా. మైదానంలోనూ అలాగే ఉంటా. మేనేజ్‌మెంట్ కూడా కేర్ తీసుకుంటుంది. ఆకాశ్ దీప్, సిరాజ్ ముందుండి నడిపించగలరు. వారికి అదృష్టం కలిసిరాలేదు. వికెట్లు తీయలేకపోయారు. సిరాజ్ ఎప్పుడూ మనస్ఫూర్తిగా బౌలింగ్ చేస్తాడు. ఈ మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్‌కు అవకాశం ఇవ్వలేకపోయాం. బౌలింగ్‌లోనూ అదనంగా మరొకరు ఉంటే బాగుంటుందనిపించి ఈ నిర్ణయం తీసుకున్నాం. జట్టు సమతూకం కోసం ఒక్కోసారి కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది" అని రోహిత్ తెలిపాడు.




# ఈ ఓటమి మానసికంగా వేధిస్తోంది.. నితీష్ రెడ్డి పోరాటం అద్భుతం..!

బోర్డర్- గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో భారత్ ఐదు టెస్టులు ఆడుతుంది. మొదటి టెస్టులో గెలిచిన తర్వాత అడిలైడ్‌లో ఓడింది. అనంతరం బ్రిస్బేన్ టెస్టును డ్రాగా ముగించుకున్న టీమిండియా మెల్‌బోర్న్‌లో జరిగిన బాక్సింగ్ డే టెస్టులో మాత్రం 184 రన్స్ తేడాతో ఓడిపోయింది. మ్యాచ్ తర్వాత జరిగిన ప్రెస్ మీట్ లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ మాట్లాడుతూ.. భారీ లక్ష్యం ముందున్నా చివరి వరకు పోరాడాలని నిశ్చయించుకున్నాం.. కానీ, ప్రణాళికలు సరిగ్గా అమలు చేయలేకపోయామన్నారు. ఏదేమైనా ఆస్ట్రేలియా బౌలర్లు అద్భుతంగా ఆడి.. మ్యాచ్‌ను తమ నుంచి లాగేసుకున్నారని తెలిపాడు. ఈ ఓటమి చాలా బాధాకరంగా ఉంది. మానసికంగా వేధిస్తోందని చెప్పకొచ్చాడు. మ్యాచ్ గెలిచేందుకు ఎన్నో మార్గాలు ఉన్నాయి.. కానీ మేము మాత్రం విజయానికి దారిని వెతకలేకపోయామని రోహిత్ శర్మ వెల్లడించారు.అయితే, ఈ మ్యాచ్ లో ఆస్ట్రేలియా పోరాడిన తీరు అసాధారణం అని రోహిత్ శర్మ తెలిపారు. ముఖ్యంగా చివరి వికెట్‌కు అద్భుతం చేశారు. ఇక, ఆఖరి రోజు 340 పరుగుల లక్ష్యం ఛేదించడం అంత ఈజీ కాదని మాకు తెలుసు. అయినా, అందుకు పునాది వేసేందుకు బాగా శ్రమించాం.. కానీ ఆసీస్ బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేయడంతో తాము అనుకున్న టార్గెట్ చేరలేకపోయామని అతడు పేర్కొన్నాడు. ఇక, తొలి ఇన్నింగ్స్‌లో శతకంతో చెలరేగిన నితీశ్ కుమార్ రెడ్డి తొలిసారి ఆసీస్ గడ్డపై టెస్టు మ్యాచ్‌లు ఆడుతున్నా.. అద్భుతంగా బ్యాటింగ్ చేశాడన్నారు. ఇక, నితీష్ కుమార్ రెడ్డి భవిష్యత్ లో విజయవంతమైన ఆల్‌రౌండర్‌గా ఎదిగే అన్ని లక్షణాలు కనిపిస్తున్నాయి.. రోజు రోజుకూ అతడు మరింత మెరుగుపడాలని రోహిత్ శర్మ తెలిపారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in